శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు వార్త

## స్పందన ద్వారా సమస్యలను పరిష్కరించుకోండి

**నెల్లూరు కార్పొరేషన్, ఆగస్టు 01, ప్రభాతవార్త:** నెల్లూరు నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన వేదికను సద్వినియోగం చేసుకుని నగర ప్రజలు తమ సమస్యలకు పరిష్కారం పొందాలని డిప్యూటి కమిషనర్ చెన్నుడు సూచించారు. కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన స్పందన వేదికలో ప్రజల నుంచి వినతి పత్రాలను ఆయన స్వీకరించారు. ఈ సందర్భంగా చెన్నుడు మాట్లాడుతూ వివిధ విభాగాలకు సంబంధించి 15 విజ్ఞాపన పత్రాలను పరిష్కారం కోసం అందుకున్నామని, వాటన్నింటినీ వీలైనంత త్వరలో పరిష్కారం అందిదించేలా కృషి చేస్తామని తెలిపారు. నగరపాలక సంస్థకు చెందిన అన్ని విభాగాల ఉన్నతాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# గిరిజనుల పొట్టకొట్టారు



- అన్యాయాన్ని ప్రశ్నించినందుకు చేపలు జీవించే చెరువుకు కరెంటు పెట్టి హతమార్చిన వైనం
- విద్యుత్ షాక్ నుంచి ప్రాణాలతో బయటపడ్డ గిరిజనులు
- చెరువు నీటిలోనే ప్రాణం విడిచిన జలచరాలు
- పోలీసులను ఆశ్రయించినా గిరిజనులకు దక్కని న్యాయం



**సైదాపురం, ఆగస్టు 01, ప్రభాతవార్త:** బానిసత్వానికి దూరమై గిరిజనులు వారి జీవనం వారు సాగించడం కొన్ని వర్గాల ప్రజలకు కొరకరాని కొయ్యలా మారింది. గ్రామాల్లో సాంఘిక దురాచారాలు, కట్టుబానిసత్వపు రోజులకు కాలం చెల్లి అణగారిన వర్గాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న తరుణంలో పాత తరం కట్టు బానిసత్వాన్ని గుర్తు చేస్తూ సైదాపురం మండలం ఊటుకూరు గ్రామంలో ఓ సంఘటన చోటు చేసుకుంది. గిరిజన వర్గాన్ని అణచివేసేందుకు ఏకంగా వారి జీవనాధారమైన చేపల చెరువుకు కరెంటు ఇచ్చి చేపలను హతమార్చిన అమానుష సంఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. స్థానిక గిరిజన కుటుంబాలు, మాజీ ఎంపీటీసీ గడ్డం వెంకటేశ్వర్లు వివరాల మేరకు.. ఊటుకూరు గ్రామంలో సుమారు 40 కుటుంబాల గిరిజనులు నివసిస్తున్నారు. అయితే వారికి సెంటు భూమి కూడా లేకపోవడంతో ప్రభుత్వానికి సంబంధించిన దేవళ్ల చెరువులో నాలుగు సంవత్సరాలుగా చేపలు పడుతూ బతుకు జీవనం సాగించేవారు. గత నెల 24వ తేదీన ఆ గ్రామానికి చెందిన కందేరి రమేష్‌నాయుడు, కందేరి ప్రసాద్‌నాయుడు, వారి అనుచరులు వారి కూలీ పనికి రావడంలేదనే అక్కసుతో చేపలు పట్టుకునే గిరిజన కుటుంబాలపై దౌర్జన్యంతో దాడి చేసి కులం పేరుతో దూషించి చెరువులో చేపలు పడితే మిమ్మల్ని, చేపలను కరెంటుతో చంపేస్తామని బెదిరించారని సైదాపురం పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. తాము గిరిజనులమని, చేపలు పట్టుకుని జీవిస్తున్నామని, కరెంటు పెడితే తమకు కూడా విద్యుదాఘాతానికి గురవుతామని విన్నవించినా పట్టించుకోకుండా గత నెల 24వ తేదీన చెరువులో కరెంటు పెట్టడంతో సుమారు నాలుగైదు టన్నుల చేపలు చనిపోవడం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దౌర్జన్యంపై 24వ తేదీన పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా ఇంతవరకు చర్యలు తీసుకోవడం జరగలేదని గిరిజనులు ఆవేదన చెందారు. గిరిజనులమైన తమకు జిల్లా అధికారులు న్యాయం చేయాలని, అగ్రవర్ణ కులస్తులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో న్యాయం జరగడంలేదని, ఫిర్యాదు చేసేందుకు వెళ్తే తమపైనే కేసులు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా కన్వీనర్ డి.పి.పోలయ్య మాట్లాడుతూ గిరిజనులను చేపలు పట్టనీయకుండా వారిపై దౌర్జన్యానికి పాల్పడుతున్న కందేరి రమేష్‌నాయుడు, కందేరి ప్రసాద్‌నాయుడు, వారి అనుచరులపై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కరెంటు పెట్టి దాదాపు నాలుగైదు టన్నుల చేపలను చంపి గిరిజన కుటుంబాలపై దెబ్బ కొట్టారని, అదేవిధంగా చెరువులో చేపలు పడితే మిమ్మల్ని కూడా కరెంటు పెట్టి చంపేస్తామని బెదిరించడం సరైనది కాదన్నారు. వీరిపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసి వారం గడుస్తున్నా కేసు కట్టి కూడా ఇంతవరకు చర్యలు తీసుకోలేదని, దాంతో పాటు రాజీ కుదిర్చేందుకు, కుదరకపోతే గిరిజనులపై అక్రమ కేసులు పెట్టేందుకు పోలీసులు ప్రయత్నించారని, దీనిని రైతు కూలీ సంఘం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. రాజ్యాంగంలో అంబేద్కర్ ఇచ్చిన హక్కులు గిరిజనులకు సరిగా అందడంలేదన్నారు. ఈ విషయమై రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో ధర్నా చేసి జిల్లా కలెక్టరు, ఎస్పీ, మత్స్య శాఖ అధికారులకు వినతిపత్రం అందించడం జరిగిందని, గిరిజనులకు న్యాయం జరిగే వరకు పోరాటం ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

## చీటీల పేరుతో ప్రజలకు టోకరా



**కందుకూరు, ఆగస్టు 1, ప్రభాతవార్త** కందుకూరు పట్టణంలోని నాంచారమ్మ కాలనీలో చీటీల పేరుతో ఒకరు ఆ ప్రాంత వాసులకు టోకరా పెట్టారు. 4కోట్ల రూపాయలకు పైగా వసూలు చేసి వెళ్లిపోయినట్లు బాధితులు సోమవారం కందుకూరు డిఎస్పీ కండే శ్రీనివాసరావును కలిసి ఫిర్యాదు చేశారు. కందుకూరు పశువైద్య శాఖలో అధికారిగా పనిచేసి ఇటీవల రిటైర్డ్ అయ్యారు. అతను ఆ కాలనీ వాసుల దగ్గర చీటీలపాట నిర్వహిస్తూ వారి వద్ద నుంచి 4కోట్ల రూపాయల వరకు బాధితులు పోలీసులకు వెల్లడించారు. ఇటీవల అతను ఇంట్లో నుంచి పరారైనట్లు డిఎస్పీకి ఫిర్యాదు చేశారు. అతనిపై చర్యతీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా డిఎస్పీ శ్రీనివాసరావు మాట్లాడుతూ కేసు నమోదు చేసి విచారణ జరుపుతామన్నారు. సిఐ వెంకటరావు, పట్టణ ఎస్సై కిషోర్‌కుమార్ విచారణ జరుపుతారని డిఎస్పీ చెప్పారు.

## పశువుల సంత వేలం - రూ. 8.2 లక్షలు పలికిన సంత



**మనుబోలు, ఆగస్టు 1, ప్రభాతవార్త:** ఎట్టకేలకు పశువుల సంత గొడవకు సోమవారం పంచాయతీ తెర దించింది. పశువుల సంత వేలం పాట నిర్వహించి తెలుగుదేశం పార్టీ నాయకులు చేస్తున్న గొడవకు ఫుల్‌స్టాప్ పెట్టింది. గత కొంతకాలంగా సంత వివాదాస్పదంగా మారిన సంగతి తెలిసిందే. తెలుగుదేశం పార్టీకి చెందదిన కొందరు వ్యక్తులు సంత వేలం పాట నిర్వహించాలని పంచాయతీ కార్యాలయం వద్ద నిలదీసిన సంగతి గ్రామంలో చర్చనీయాంశమైంది. ఈ నేపథ్యంలో సోమవారం ప్రశాంతంగా పశువుల సంత, చెరువు యేరు వేలం పాటలో ఎలాంటి వివాదాలకు తావు లేకుండా నిర్వహించారు. 2022-23 సంవత్సరానికి పశువుల సంత సర్కారువారి పాట రూ. 6 లక్షల పైన వేలం నిర్వహించడం జరిగిందది. 7 మంది డిపాజిట్‌దారులు హాజరయ్యారు. ఏలూరు వెంకటకృష్ణారెడ్డి అనే వ్యక్తి రూ. 8.2 లక్షలతో పశువుల సంతను దక్కించుకున్నారు. అలాగే కుడిచెరువు యేరును రూ.2.66 లక్షలతో దువ్వూరు వెంకటరమణారెడ్డి దక్కించుకున్నారు. ఈ వేలంపాట సర్పంచు కంచి పద్మమ్మ అధ్యక్షతన, ఉపసర్పంచు కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి సమక్షంలో నిర్వహించారు. ఈవోపీఆర్‌డి పుట్టా వెంకటరమణయ్య, పంచాయతీ కార్యదర్శి ఆత్మకూరు వెంకటరమణయ్యలు పాల్గొన్నారు.

## డిఆర్వోతో టీడీపీనేత అజీజ్ వాగ్వివాదం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమంలో వినతిపత్రం తీసుకొనే విషయమై జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మకు, టీడీపీ నెల్లూరు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్‌ల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. రేషన్‌వ్యవస్థకు సంబంధించిన లోపాలపై టీడీపీ నాయకులతో కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన తన నుండి తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి కూర్చొనే అర్జీ తీసుకొనే ప్రయత్నం చేయగా అజీజ్ అభ్యంతరం తెలిపారు. ఎన్నికల సమయంలోనే కూర్చొని వినతిపత్రాలు తీసుకోవాలని ప్రస్తుతం ఆ పరిస్దితి లేనందున నిలబడి తీసుకోవాలని అజీజ్ కోరగా బాపిరెడ్డి నిలబడి అయన నుండి వినతిపత్రం తీసుకున్నారు. ఈ సమయంలో అక్కడే వున్న డిఆర్వో జోక్యం చేసుకోగా అజీజ్ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. తాను సాధారణ పౌరుడ్ని కాదని..ప్రజల తరపున వచ్చానని,,మీరు ప్రజలకు సేవ చేయాల్సినవారని పేర్కొనడం గమనార్హం. చివరగా వెల్తూ వెల్తూ మీరు డిఆర్వోనా అంటూ అజీజ్ ఆమెకు నమస్కారం పెట్టి వెళ్ళడం కొసమెరుపు.

## జిల్లాలో 81.21 శాతం పెన్షన్ల పంపిణీ

**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** జిల్లాలో ఆగస్టు నెలకు సంబంధించిన సామాజిక పెన్షన్ల పంపిణీ సోమవారం 80.81 శాతం పూర్తిచేశారు. జిల్లాలో మొత్తం 3,06,744 మంది లబ్దిదారులకు పెన్షన్ సొమ్ము అందజేయాల్సివుండగా అందులో సోమవారం 2,49,122 మందికి పంపిణీ చేయడం గమనార్హం. మండలాలవారీగా రాపూరులో 90.97 శాతం, అల్లూరులో 88.11 శాతం, కోవూరులో 87.53 శాతం, నెల్లూరులో 87.36 శాతం, సంగంలో 87.27 శాతం, ఆత్మకూరు అర్బన్‌లో 86.87 శాతం, కొడవలూరులో 86.38 శాతం, టీపీగూడూరులో 86.09 శాతం, ఇందుకూరుపేటలో 85.91 శాతం, బుచ్చిరెడ్డిపాలెంలో 85.72 శాతం, మనుబోలులో 85.7 శాతం, ఏఎస్‌పేటలో 85.45 శాతం, అనంతసాగరంలో 84.69 శాతం, వెంకటాచలంలో 84.2 శాతం, సైదాపురంలో 83.84 శాతం, ఉదయగిరిలో 83.75 శాతం, వింజమూరులో 83.56 శాతం, కలువాయిలో 83.31 శాతం, బుచ్చిరెడ్డిపాలెం అర్బన్‌లో 83.05 శాతం, సీతారాంపురంలో 82.64 శాతం, బోగోలులో 82.4 శాతం, కావలిఅర్బన్‌లో 81.81 శాతం, విడవలూరులో 81.55 శాతం, ఆత్మకూరులో 81.38 శాతం, దుత్తలూరులో 80.99 శాతం, మర్రిపాడులో 79.73 శాతం, ముత్తుకూరులో 79.4 శాతం, కందుకూరుఅర్బన్‌లో 79.36 శాతం, జలదంకిలో 78.76 శాతం, కావలిలో 78.57 శాతం, కొండాపురంలో 78.22 శాతం, ఉలవపాడులో 77.81 శాతం, వరికుంటపాడులో 77.55 శాతం, నెల్లూరుఅర్బన్‌లో 77.5 శాతం, చేజర్లలో 77.31 శాతం, వలేటివారిపాలెంలో 76.6 శాతం, పొదలకూరులో 76.5 శాతం, కలిగిరిలో 76.21 శాతం, దగదర్తిలో 75.98 శాతం, కందుకూరులో 75.41 శాతం, గుడ్లూరులో 72.49 శాతం నగదు పంపిణీ జరిగింది.

## ఆధార్ సీడింగ్ ప్రారంభించాలి



**నెల్లూరురూరల్, ఆగస్టు1 ప్రభాతవార్త** ఓటరు కార్డుకు ఆధార్ సీడింగ్ ప్రారంభించాలని ఆర్డీఓ కొండయ్య ఆదేశించారు. నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో సోమవారం వివిద రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులతో ఆర్డీఓ కొండయ్య ఈమేరకు సమీక్షించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆధార్ ప్రక్రియ వేగవంతం కావాలన్నారు. ఎలక్షన్ కమిషన్‌తో పాటూ ప్రభుత్వ మార్గదర్గదర్శకాలను పరిగణనలోకి తీసుకుని ప్రతిఒక్కరూ ఆధార్ సీడింగ్ విషయంలో తమ వంతు బాధ్యతను నిర్వహించాలన్నారు. తహశీల్దార్ వెంకటేశ్వర్లు తదితర కార్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# వేడుకగా హర్ ఘర్ తిరంగా ర్యాలీ




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపధ్యంలో భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన షెడ్యూల్ మేరకు ఇంటింటా జాతీయజెండా ఎగురవేసే కార్యక్రమంపై అవగాహన కల్పించేందుకు సోమవారం నెల్లూరులో నిర్వహించిన హర్ ఘర్ తిరంగా ర్యాలీ వేడుకగా కొనసాగింది. గాంధీబొమ్మ వద్ద జిల్లాపరిషత్ ఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఈ ర్యాలీని జెండా వూపి ప్రారంభించారు. ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉద్యోగులు, సచివాలయ సిబ్బంది, విద్యార్దులతో కూడిన ఈ ర్యాలీ గాంధీబొమ్మ నుండి వీఆర్‌సీ సెంటర్ మీదుగా కలెక్టరేట్ వరకు కొనసాగింది. చిన్నారులు స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలతో ఈ ర్యాలీలో పాల్గొనడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు గాంధీబొమ్మ వద్దగల మహాత్మాగాంధీ విగ్రహానికి, కలెక్టరేట్ ఆవరణంలోని మహాత్ముడి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటుచేసిన సభను ఉద్దేశించి జెడ్పీఛైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతున్న నేపధ్యంలో కేంద్ర ప్రభుత్వం ఆజాదీ కా అమృత్ దినోత్సవ్ పేరిట పలు కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందన్నారు. ఆగస్టు 1 నుండి 15వ తేదీ వరకు దేశవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమాలలో జిల్లా ప్రజలందరూ పాల్గొనాలని..ఇందులో భాగంగా నిర్దేశించిన రోజులలో ఇంటింటా జాతీయ పతాకాలు ఎగురవేయాలన్నారు. కాగా ఈ కార్యక్రమాలలో జిల్లా పంచాయితీ అధికారి ఎం.ధనలక్ష్మి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ చందర్, వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, జిల్లా సహకారశాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, మైనారిటీ సంక్షేమశాఖాధికారి కనకదుర్గాభవాని, నెల్లూరుఅర్బన్ తహసీల్దార్ నిర్మలానందబాబా తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుండి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు



-ఒక్క నిముషం ఆలస్యమయినా కేంద్రాలోకి అనుమతించం
-పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 66 కేంద్రాల ఏర్పాటు
-సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట బందోబస్తు, -ఆర్ఐఓ టి.వరప్రసాదరావు

**నెల్లూరు, ఆగస్టు1 ప్రభాతవార్త-విద్య** జిల్లావ్యాప్తంగా రేపటినుండి ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు నిర్వహించనున్నామని ఇంటర్‌బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి(ఆర్ఐఓ) టి.వరప్రసాదరావు పేర్కొన్నారు. సోమవారం నగరంలోని స్ధానిక ఆర్ఐఓ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు ప్రశాంతంగా పరీక్షలు నిర్వహించేందుకు అవసరమయ్యే అన్నీ ఏరా ్పట్లు పూర్తిచేశామన్నారు. బుధవారం నుండి ప్రారంభం కానున్న ఈ పరీక్షల నిర్వహణకు 66 కేంద్రాలను ఏర్పాటుచేశామన్నారు. ప్రధమ సంవత్సరం విద్యార్థులు 20518మంది, ది ్వతీయ సంవత్సరం విద్యార్దులు9403మంది విద్యార్థులు, మొత్తంగా 29921మంది పాల్గొననున్నారన్నారు. ప్రధమ సంవత ్సరం విద్యార్థులకు ఉదయం 9 గంటలనుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం 2.30 నుండి 5.30 నిముషాలకు వరకు రెండు సెషన్స్ లోపరీక్షలు జరుగనున్నాయన్నారు. విద్యార్థులకు కేంద్రాల్లోకి 30 నిముషాల ముందుగానే అనుమతిస్తామని అయితే పరీక్షల ప్రారంభ సమయానికి ఒక్క నిముషం ఆలస ్యమైయినా ఎట్టి పరిస్థితుల్లోను కేంద్రాలోని అనుమతించబోమని హెచ్చరించారు. విద్యార్థులందరూ ఈ నిభంధనను గుర్తించి ముందుగానే వారి వారి పరీక్షాకేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అలాగే పరీక్షలను పాదర్శకంగా నిర్వహించాలన్న ఉన్నతాధికారుల ఆదేశాలతో అన్నీ పరీక్షాకేంద్రాల్లో అన్నీ రూముల్లో సిసి కెమెరాలను ఏర్పాటుచేయ్యాలన్నారు. చీఫ్ సూపరింటెండెంట్స్, జవాబుపత్రాల ప్యాకింగ్ జరిగే గదులకు సైతం కెమెరాలను ఏర్పాటుచేయ్యాలన్నారు. అలాగే కేంద్రాలోకి సెల్‌ఫోన్ ్లను అనుమతించబోమన్నారు. పరీక్షలకు నిర్వహించే కేంద్రాల్లో విధుల హాజరుకు అనుమతించిన వారు తప్ప ఆయా కళాశాలల సిబ్బంది ఉండకూడదని స్పష్టంచేశారు. జిల్లా వ్యాప్తంగా సమస్యాత్మకంగా ఉన్న 8 కేంద్రాలను ముందుగానే గుర్తించామని అవాంచనీయ సంఘటలను జరుగకుండా పటిష్ట బందోబసు ్తను ఏర్పాటుచేశామని ఆయన తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 34 స్టోరేజ్ పాయింట్స్‌లో పశ్నాపత్రాలను బధ్రపరిచామన్నారు.

పరీక్షలకు నిరంతరం పర్యవేక్షించేందుకు 4 ఫ్లైయింగ్‌స్క్వాడ్ బృందాలను, 5 సిట్టింగ్ స్కా ్వడ్ బృందాలను, డిఈసి మెంబర్స్‌ను ఏర్పాటుచేశామన్నారు. పరీక్షల నిర్వహణలో అన్నీ కే ంద్రాల్లో తప్పక నిభందలను పాటించాలని లేకుంటే ఆయా కళాశాలల గుర్తింపును రద్దుచేస్తామని హెచ్చరించారు. విద్యార్థులు ప్రశాతంగా పరీక్షలు రాసి మంచి మార్కులు తెచ్చుకోవాలి ఆయన కోరారు. ఈ సమావేశంలో డిఈసి సభ్యులు ఎస్.ఏ.సికిందర్, కె.మధుబాబు, సిహెచ్.శ్రీనివాసులరెడ్డి, ఏ.వెంకటేశ్వర్లు, ఏ.బాలసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రెసిడెంట్ మెడల్ అందుకున్న సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్



**నెల్లూరు, ఆగస్టు1 ప్రభాతవా ర్త-విద్య** గత 23 సంవత్సరాలుగా ఎన్‌సిసిలో ఉత్తమ సేవలు అందించి నందుకు గాను నగరంలోని సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్ సివి సురేష్‌కు రాష్ట్రపతి ద్వారా కమాండెడ్ ర్యాంకుఅవార్డును ప్రధానం చేశారు. ఆంధ్రా, తెలంగాణా రాష్ట్రాల డైరెక ్టర్ జనరల్ ఎన్‌సిసి ఎయిర్ కమాండర్ ఆయనకు ఈ అవార్డును ప్రధానం చేసి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. సర్వోదయ కళాశాల ప్రిన్సిపాల్‌కు రాష్ట్రపతి అవార్డు వచ్చినందుకుగాను ఆ కళాశాల కరస్పాండెంట్ రాధాకృష్ణ శుభాకాంక్షలు తెలిపారు.

## నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులతో సమావేశం



**నెల్లూరు ఆగస్టు 1, ప్రభాతవార్త-వైద్యం** సోమవారం సాయంత్రం నగరంలోని తెలుగుదేశం పార్టీ జిల్లా కేంద్ర కార్యాలయంలో నెల్లూరు పార్లమెంటు పరిధిలోని 7 నియోజకవర్గాల ఇన్‌చార్జ్‌లు, పరిశీలకులతో రేపల్లె శాసనసభ్యుడు, జోన్ 4 ఇన్‌చార్జ్ అనగాని.సత్యప్రసాద్, మాజీ శాసనసభ్యుడు జోన్ 4 కోఆర్డినేటర్ బీసీ జనార్ధన్‌రెడ్డిలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి పొలిట్ బ్యూరో సభ్యుడు సోమిరెడ్డి.చంద్రమోహన్‌రెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద.రవిచంద్ర, నెల్లూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు, రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్ అజీజ్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ, మండల, గ్రామ, బూత్, అనుబంధ విభాగాల పెండింగ్ కమిటీలు పూర్తి, సభ్యత్వ నమోదు, బాదుడే బాదుడు, జిల్లా మహానాడు ఏర్పాటు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సమావేశంలో కావలి నియోజకవర్గ ఇన్‌చార్జ్ మాలేపాటి.సుబ్బానాయుడు, నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోటంరెడ్డి.శ్రీనివాసులురెడ్డి, కందుకూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఇంటూరి.నాగేశ్వరరావు, నెల్లూరు పార్లమెంటు టీడీపీ ప్రధాన కార్యదర్శి చేజర్ల.వెంకటేశ్వర్లురెడ్డి, డిసిప్లినరి కమిటీ సభ్యుడు గుంటుపల్లి.నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శులు గుడపాటి.శ్రీనివాస్, గుమ్మడిపూడి.దశరథాచారి, నేలబల్లి.భాస్కర్‌రెడ్డి, పంతాని.మురళిలు పాల్గొన్నారు.

## ఏడుమంది విద్యార్థులకు ట్రస్ట్ ఆధ్వర్యంలో నగదు బహుమతి



**మర్రిపాడు, ఆగస్ట్ 1, ప్రభాతవార్త:** కదిరినాయుడుపల్లి ఉన్నతపాఠశాలలో గత రెండు సంవత్సరాల్లో 10వ తరగతి పరిక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరచి మొదటి , ద్వితీయ , తృతీయ స్థానాలు సాధించిన ఏడుమంది విద్యార్థులకు సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో లక్షరూపాయలు నగదు బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మెన్ శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రవాస భారతీయులు రామిరెడ్డి ఓబులురెడ్డి , వారి సోదరులు శ్రీనివాసులురెడ్డి, కేశవరెడ్డి ఈప్రాంత విద్యాభివృద్ధికి ఎంతగానో కృషి చేస్తున్నారని, అందులో భాగంగా విద్యార్థులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో సుజాతమ్మ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతులను అందజేస్తున్నామని , విద్యార్థులు ట్రస్ట్ సేవలను ఉపయోగించుకొని బాగా చదివి మంచి స్థాయికి రావాలని ఆకాంక్షించారు. అనంతరం కదిరినాయుడుపల్లి కాంప్లెక్స్ లోని అన్ని ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు నోటుపుస్తకాలు, ఇతర విద్యాసామాగ్రిని పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ మాట్లాడుతూ గత 20సంవత్సరాలుగా సుజాతమ్మ ట్రస్ట్,, రామిరెడ్డి గంగిరెడ్డి రామలక్ష్మమ్మ చారిటబుల్ ట్రస్ట్ వారు విద్య, వైద్య రంగాల్లో చేస్తున్న సేవలు అమోఘమని ఎంతో మంది విద్యార్థుల జీవితాల్లో వెలుగులు నింపారని వైద్యపరంగా అనేకమందికి సహాయ సహకారాలు అందించారని రామిరెడ్డి సోదరులు అమెరికాలో ఉంటున్నప్పటికీ వారి మనసంతా మన ప్రాంత విద్యార్థుల భవిష్యత్తుమీదే ఉంటుందని అన్ని దానాలకన్నా విద్యాదానం మహాదానమని వారు నమ్ముతారని వారి సేవలను ఘనంగా ప్రశంసించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## అల్లూరులో ఆజాదికా అమృత మహోత్సవ ర్యాలీ



**అల్లూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త:** ఆజాదికా అమృత మహోత్సవ వేడుకలలో భాగంగా అల్లూరు మండల పరిషత్ కార్యాలయం నుండి సోమవారం అల్లూరు బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఎంపిడివో వసుంధర, ఎంపిపి దర్శిగుంట శశిరేఖ, కమిషనర్ పణికుమార్‌లు ముందు వరుసలో వుండి వైఎస్ఆర్‌కెపి సిబ్బంది, పాఠశాల విద్యార్థులతో ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ స్వాతంత్ర సమరయోధుల కృషిని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంఇవో నాగేశ్వరరావు, ఇవోపిఆర్‌డి పెంచల వీరేంద్ర, అధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## రాష్ట్రంలో రేషన్ వ్యవస్థ నిర్వీర్యం



**కందుకూరు, ఆగస్టు1, ప్రభాతవార్త:** రేషన్ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ తెలుగుదేశం నాయకులు వినతిపత్రాలు అందజేశారు. రాష్ట్ర పార్టీ ఇచ్చిన పిలుపు మేరకు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలోకందుకూరు తహశీలా ్దర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ కరోనా సమయంలో పిఎంజికెవై పథకం కింద అందాల్సిన ఉచిత బియ్యాన్ని రాష్ట్రం ప్రభుత్వం నిలిపివేశారని చెప్పారు. ఇది ఆహార భద్రత చట్టాన్ని ఉల్లగించడమేనని పేర్కొన్నారు. అన్ని పథకాలకు రేషన్ కార్డు ప్రామాణికంగా చేసిన జగన్ ప్రభుత్వం రకరకాల కారణాలు చూపించి 18లక్షలకు పైగా రేషన్ కార్డులు తొలగించారన్నారు. రేషన్ షాపులు ఇచ్చిన సరుకుల్లో నాణ్యత లేదని ఇంటూరి నాగేశ్వరరావు స్పష్టం చేశారు. దేశంలో అన్ని రాష్ట్రాలు ఉచిత బియ్యం పథకాన్ని అమలు చేస్తుంటే ఏపిలో మాత్రం నాలుగు నెలలుగా ఈ పథకాన్ని నిలిపివేశారని విమర్శించారు. దీనివల్ల 1కోటి 47లక్షల కార్డు దారులకు బియ్యం అందలేదన్నారు. 2940కోట్లు విలువైన ఉచిత బియ్యం పేద ప్రజలకు దక్కకపోవడంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో దామా మల్లేశ్వర రావు, గోచిపాతల మోషే, నాదెళ్ల సుబ్బారావు, చిలకపాటి మధు, చదలవాడ కొండయ్య, కూనం నరేంద్ర, ముచ్చు శ్రీను, మహర్షి శ్రీను, వడ్డెళ రవిచంద్ర, రెబ్బవరపు మాల్యాద్రి, షేక్. సలాం, మున్నా, వెంకటేశ్వర్లు, ఫిరోజ్, బత్తెన ఆదెమ్మ, కల్లూరి శైలజ తదితరులు పాల్గొన్నారు.

## కొండికందుకూరులో గడపగడపకు కార్యక్రమం



**కందుకూరు, ఆగస్టు1, ప్రభాతవార్త:** మండలంలోని కొండికందుకూరు గ్రామంలో రెండవరోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శాసనసభ్యుడు మానుగుంట మహీధర్‌రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరై ఇంటింటికి తిరిగారు. సంక్షేమ పథకాలు తీరు తెన్నులపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. వయో వృద్ధులతో మాట్లాడారు. ఫించన్లు అందుతున్నాయా అనే అంశంపై ఆరా తీశారు. గ్రామంలో ఇటీవల జరిగిన అభివృద్ధి పనుల గురించి వారికి వివరించారు. ఈ కార్య క్రమంలో అధికారులు, వైసీపి నాయకులు హాజరైయ్యారు. సిఎం సమీక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సోమవారం కొండికందుకూరు గ్రామంలో జరుగుతోంది. దీనికి ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి హాజరైయ్యారు. మధ్యాహ్న సమయంలో సిఎం ఆఫీస్ నుంచి సమావేశానికి రావాలంటూ సమాచారం రావడంతో ఆయన అర్ధాంతరంగా కార్యక్రమం ముగించుకుని తాడేపల్లిలోని సిఎం కార్యాలయానికి వెళ్లారు.

## రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని తుంగలో తొక్కడమే



**కొడవలూరు జూలై 30 ప్రభాతవార్త :** కరోనాతో ఎదురైన ఇబ్బందులు నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం తెల్లరేషన్ కార్డుదారులకు పిఎంజెకెవై పథకం కింద రేషన్ ఉచితంగా అందించడం జరిగిందిని. ఆ పథకాన్ని ఏప్రిల్ నుండి సెప్టెంబర్ పొడిగించడం జరిగిందిని. దేశంలోని అన్ని రాష్ట్రాలు ఉచిత బియ్యం పథకాన్ని అయా రాష్ట్రాల్లో అమలు చేస్తూ ఆహార పద్ధతులకు పెద్దపీట వేశారుని. కానీ రాష్ట్ర ప్రభుత్వం 4 నెలలుగా ఈ పథకాన్ని నిలిపివేశారుని, తెల్లరేషన్ కార్డు దారులకు బియ్యం ఇవ్వకుండా, రాష్ట్ర ప్రభుత్వం ఆహార భద్రత చట్టాన్ని తుగలో తొక్కడమేనని కొడవలూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అన్నారు. తెలుగుదేశం పార్టీ కోవూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అదేశాలు మేరకు కొడవలూరు మండలం పార్టీ అధ్యక్షుడు కోటంరెడ్డి అమరేంద్రరెడ్డి అధ్యక్షతనాన మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి సోమవారం తహసీల్దారు కార్యాలయం ఆవరణంలో ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమంలో అమరేంద్రరెడ్డి, కరకటి మల్లికార్జున్, రాజేంద్ర, చెముకుల వెంకయ్య, పంది శ్రీనివాసులు, నక్క రమణయ్య, మాధవ్‌రెడ్డి, సుధకర్ యాదవ్, భక్తవత్సల తదితరులు పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త :** కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణం నుంచి ఆజాదీ కా అమృత్ మహోత్సవంలో భాగంగా హర్ ఘర్ తిరంగా కార్యక్రమానికి సంబంధించి సోమవారం భారీ ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా తాలూకా కార్యాలయ ప్రాంగణం నుంచి కోవూరు పురవీధుల మీదుగా గాంధీ పార్కు వరకు పొదుపు మహిళలు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థినులు నినాదాలు చేస్తూ ఈ కార్యక్రమాన్ని కొనసాగించారు. అనంతరం ఎంపీడీవో శ్రీహరి మాట్లాడుతూ ఆగస్టు 1వ తేది నుంచి 15వ తేది వరకు ప్రతి రోజూ వివిధ కార్యక్రమాలు చేపట్టేలా ప్రణాళికలు కూడా రూపొందించడం జరిగిందన్నారు. ఈ నెల 13, 14వ తేదీల్లో ప్రతి ఇంటి మీద తప్పనిసరిగా జాతీయ జెండాను ఎగురవేయాలని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. గ్రామ సర్పంచ్ విజయమ్మ, ఎంఈవో రహీమ్, పంచాయతీ రాజ్ ఏఈ పరమేశ్వరలింగం, గృహ నిర్మాణ శాఖ ఏఈ అశోక్‌కుమార్ సింగ్, ఈవోపీఆర్డీ కల్పన, కార్యాలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, వెలుగు ఏపీఎం వెంకటస్వామి, పొదుపు మహిళలు, విద్యార్థినులు , ఉపాధ్యాయులు ఉన్నారు.

## ఎస్కార్ట్స్‌కు నిత్యావసర సరుకుల పంపిణీ



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త :** రత్నం విద్యాసంస్థల అధినేత కిషోర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కోవూరులోని ఎస్కార్ట్స్ బుద్ధి మాంద్యత గల కేంద్రానికి రెండు నెలలకు సరిపడా నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రత్నం విద్యాసంస్థలకు సంబంధించిన గౌసియా మాట్లాడుతూ గత సంవత్సరాలుగా తమ పాఠశాల అధినేత కిషోర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ కార్యక్రమాలను కొనసాగిస్తున్నామన్నారు. మానసిక, శారీరక వికలాంగుల పిల్లలను తమ కన్న బిడ్డలుగా చూసుకుంటున్న నిర్వాహకులు అరుణకుమారి -రవి దంపతులను ప్రత్యేకంగా అభినందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అరుణ్ సింగ్, తదితరులు ఉన్నారు.

## కొమ్మలపూడిలో అజాద్ అమృత్ మహోత్సవం



**మనుబోలు, ఆగస్టు 1, ప్రభాతవార్త:** మండలంలోని కొమ్మలపూడి గ్రామంలో సోమవారం అజాత్ అమృత్ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డానియెల్ ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రదర్శనలో పాల్గొన్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని పంచాయతీ కార్యాలయంలో సర్పంచు వేణు వృద్ధులకు, వికలాంగులకు, వితంతువులకు పింఛన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ వైస్ చైర్మన్ చందులూరి శ్రీనివాసులుయాదవ్, ఎంపీటీసీ గుండాల శిరీష, సచివాలయ కార్యదర్శి పవన్‌కుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ జాన్ అభిషేక్, పట్టా మస్తానయ్య, సి. హెచ్. రఘురామయ్య, వెల్‌ఫేర్ అసిస్టెంట్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

## ఇంట్లో చోరీ

**ఉలవపాడు రూరల్, ఆగస్టు1, ప్రభాతవార్త:** ఉలవపాడు మండలం కరేడులో ఓ ఇంట్లో చోరీ జరిగింది. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు అందింది. స్థానిక గ్రామ నివాసి పి. రామకృష్ణారెడ్డి ఇంట్లో చోరీ జరిగిన సంఘటనలో 6సవర్ల బంగారం, కొంత డబ్బును ఎత్తుకువెళ్లినట్లు ఆయన పోలీసులకు చెప్పారు. రామకృష్ణారెడ్డి ఆదివారం బంధువుల ఇంటికి వెళ్లడంతో ఇది గమనించిన దొంగలు రాత్రివేళ ఇంట్లోకి వెళ్లి బీరువా పగలగొట్టి నగలు, బంగారాన్ని దోచుకుని వెళ్లారు. ఈ విషయంపై ఉలవపాడు పోలీసులకు ఫిర్యాదు చేయడంపై దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రతి ఇంటిపై జాతీయపతాకం ఎగరాలి



**ఉలవపాడు రూరల్, ఆగస్టు1, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా ఆజా దీక అమృత మహోత్సవం నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా కరేడులో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో చెంచమ్మ మాట్లాడుతూ ప్రతి ఇంటిపై జాతీయ జెండాను ఎగురవేయాలిని పిలుపునిచ్చారు. ఎంపిపి వాయిల మస్తానమ్మ, ఆగ్రామ సర్పంచ్‌తో పాటు పలువురు హాజరైయ్యారు.

## ప్రజాపంపిణీ వ్యవస్థ నిర్వీర్యంపై వినతి



**ఉలవపాడు, ఆగస్టు1, ప్రభాతవార్త:** టిడిపి ఇన్‌చార్జి ఇంటూరి నాగేశ్వరరావు ఆదేశాల మేరకు ఉలవపాడు మండల తెలుగుదేశం నేతలు రేషన్ వ్యవస్థ నిర్వీర్యంపై తహశీల్దార్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ప్రభుత్వ వైఖరి వారు నిరసిస్తూ ర్యాలీగాతహశీల్దార్ కార్యాలయం వరకూ వెళ్లారు. మండలపార్టీ అధ్యక్షులు రాచగల్లు సుబ్బారావు ఆధ్వర్యంలో పేదలందరికీ బియ్యాన్ని పంపిణీ చేయాలని కోరుతూ తహశీల్దార్ హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం రేషన్ వ్యవస్థను అస్తవ్యస్తం చేసిందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏపి. వాసు, ఎస్‌కె బాజీ, అమ్మనబ్రోలు మాధవరావు, చాగొల్లు మహేష్, కరేటి గోపాల్, గంజి కోటేశ్వరరావు, పుణ్యేపల్లి చిన్నయ్య, శివకుమార్ తదితరులు హాజరైయ్యారు.

## ఉచిత రేషన్‌బియ్యం పంపిణీ

**అనంతసాగరం, ఆగస్ట్1, ప్రభాతవార్త:** మండలంలోని పిఎంజెకెవై ఉచిత బియ్యాన్ని పంపిణీ చేసే చౌకదుకాణాలను సోమవారం మండలంలోని గ్రామ రెవెన్యూ పర్యవేక్షించారు. 300మందికి పైగా ఉచిత బియ్యం పంపణీ చేశారు. రేవూరు చౌకదుకాణంలో గ్రామ రెవెన్యూ అధికారి ఎస్. కె. మీరావలి ఆధ్వర్యంలో 270మందికి పైగా పిఎంజెకెవై ఉచిత బియ్యం పంపిణీ చేశారు.

## పెద్దాసుపత్రిలో అరుదైన శస్త్రచికిత్స

**నెల్లూరు ఆగస్టు 1, ప్రభాతవార్త-వైద్యం** నగరంలోని స్థానిక దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో (పెద్దాసుపత్రి) ఓ మహిళకు అరుదైన ఆపరేషన్ చేసి దాదాపు మూడున్నర కిలోల బ్రస్ట్ ట్యూమర్‌ని తొలగించిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఈ మేరకు వివరాల్లోకి వెళితె కడప ప్రాంతానికి చెందిన మహిళ షుమారు 27 ఏళ్ళ మహిళకు తీవ్రమైన చాతి వాపు, నొప్పితో పెద్దాసుపత్రికి గత శనివారం వైద్యం కోసం వచ్చింది. ఆమెకు పరీక్షలు చేసి పరిశీలించిన వైద్యులు స్కానింగు చేసి రొమ్ములో పెద్ద కణిత ఉన్నట్లు గుర్తించారు. దీంతో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ రాజేశ్వరి ఆ మహిళకు ఆపరేషన్ చేసి కణితను తొలగించాలని తెలిపారు. అయితే గతంలో కూడా ఇలానే ఓ చిన్న కణిత ఏర్పడినప్పుడు ప్రైవేటు వైద్యులు ఆపరేషన్ చేసి తొలగించినట్లు రోగి బంధువులు చెప్పారు. దీంతో మరింత జాగ్రత్త తీసుకున్న వైద్యులు ప్రస్తుతం ఎలాంటి చిన్న అవశేషాలు కూడా లేకుండా కణితను తొలగించాలని నిర్ణయంచారు. వేగంగా కణిత పెరిగినందు వల్ల ఆపరేషన్ మళ్ళీ చేయాలని రోగికి వివరించారు. రోగి అనుమతితో సోమవారం వైద్య బృందం 4 గంటలు శ్రమించి ఆపరేషన్ చేసి సుమారు మూడున్నర కిలోల కణితను తొలగించారు. కణితను బయాప్సీకి పంపించి రిపోర్టు కోసం ఎదురు చూస్తున్నారు. కణితను తొలగించడంలో రోగికి నొప్పి తగ్గి ప్రస్తుతం కోలుకుంటోంది. ఈ సందర్భంగా సర్జరీ హెడ్‌ఓడీ డాక్టర్ రాజేశ్వరి, చీఫ్ డాక్టర్ రోజారమణి మాట్లాడుతూ పెద్దాసుపత్రిలో అన్ని రకాల ఆపరేషన్‌లు చేసేందుకు పరికరాలు అందుబాటులో ఉన్నాయన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ప్రజలకు వైద్య సేవలు అందిస్తామన్నారు. ప్రస్తుతం చేసిన ఆపరేషన్ ప్రైవేటు వైద్యశాలలో చేయాలంటే కనీసం లక్ష అవుతుందన్నారు. ప్రజలు పెద్దాసుపత్రిలో ఉచిత వైద్య సేవలు పొంది సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రోగి బంధువులు వైద్యులకు కృతజ్ఞతలు తెలిపారు. శస్త్రచికిత్సను విజయవంతంగా చేసిన వైద్య బృందం డాక్టర్ రోజారమణి, రాజేశ్వరి, రమణయ్య, ప్రతాప్, కీర్తిర్మయి, స్టీఫెన్ నవీన్, మత్తు డాక్టర్లు సత్యనారాయణ, శివశంకర్లను ఆసుపత్రి అభివృద్ధి కమిటీ కన్వీనర్ లక్ష్మీసునంద, పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణరాజులు అభినందించారు.

## గోవిందంపల్లికి బస్సు ఏర్పాటు



**అనంతసాగరం, ఆగస్ట్1, ప్రభాతవార్త:** ఆత్మకూరు నియోజకవర్గం శాసనసభ్యులు మేకపాటి విక్రమ్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహకారంతో ఆత్మకూరు డిపో నుండి అనంతసాగరం మండలం గోవిందంపల్లికి నూతన ఆర్టీసి సర్వీసును ఏర్పాటు చేసినట్లు పాతాళపల్లి గ్రామ సర్పంచ్ బిజివేముల ఓబులురెడ్డి పేర్కొన్నారు. అనంతసాగరం మండలం గోవిందంపల్లి ఆర్టీసి బస్సుకు సర్పంచ్ బిజివేముల ఓబులురెడ్డి ఘన స్వాగతం పలికారు. చాలా సంవత్సరాల తర్వాత ముస్తాపురం, పాతాళపల్లి, గోవిందమ్మ పల్లి గ్రామాలకు ఆర్టీసి బస్సు నడపడం శుభదాయకమన్నారు. ఆత్మకూరుకు వెళ్ళేందుకు విద్యార్థులు, కాలేజీ స్టూడెంట్స్ , ప్రజలు నానా ఇబ్బందులు పడేవారని, ఆర్టీసి బస్సు ఏర్పడడం ద్వారా సమయానికి పాఠశాలకు కాలేజీలకు వెళ్ళవచ్చున్నారు. అనంతసాగరం మండల వైఎస్ఆర్‌సిపి మండల కన్వీనర్ రాపూరు వెంకటసుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు వి. ప్రభాకర్‌రెడ్డి, మండల అధికారులు బస్సు ఏర్పాటుకు కృషి చేసిన వారికి ధన్యవాదాలు తెలిపారు.

## ధాన్యం నగదును వెంటనే రైతులకు ఇప్పించాలి



**కావలి రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఆరుగాలం కష్టించి పండించి అందజేసిన ధాన్యానికి వెంటనే రైతులకు నగదు ఇప్పించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కావలి, జలదంకి మండల కమిటీలు ఆధ్వర్యంలో సోమవారం స్పందన కార్యక్రమంలో కావలి ఆర్డీవో శీనానాయక్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు టి. మాల్యాద్రి మాట్లాడుతూ సియంఆర్‌కు ధాన్యం తోలి ఆరు నెలలు గడిచినా ఇప్పటి వరకు వరి ధాన్యం డబ్బులు రైతులకు ఇవ్వలేదన్నారు. దీంతో పేద, మధ్యతరగతి రైతులు తెచ్చిన అప్పులకు సమాధానం చెప్పలేక, అమ్మిన ధాన్యానికి డబ్బులు రాక అష్టకష్టాలు పడుతున్నారన్నారు. ఎరువులు, పురుగు మందులు, ట్రాక్టర్ బాడుగులకు డబ్బులు లేక ఏమి చేయాలో తెలియక త్రిశంకుస్వర్గంలో కొట్టుమిట్టాడుతున్నారన్నారు. కొంతమంది రైతులకు బ్యాగులు లేవని కంప్యూటర్ ఆపరేటర్లు సక్రమంగా రిపోర్టు చేయనందున, మిల్లర్లు బియ్యాన్ని ప్రభుత్వానికి తోలకుండా బయట అమ్ముకుంటున్నందున రైతులకు నగదు రావడం లేదన్నారు. రైతులకు రకరకాల కారణాలు చెప్పి ఇబ్బందులు పెడుతున్నారన్నారు. పంటలకు మద్దతు ధర అమలుకు గ్యారంటీ చట్టం కూడా ప్రభుత్వం చేయాలన్నారు. తక్షణమే రైతులకు ధాన్యం నగదు అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసామ కార్మిక సంఘం కావలి మండల అధ్యక్షులు పి. సీతారామయ్య, జి. సురేష్‌రెడ్డి, యం. రాధాకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## ఉలవపాడు మండలంలో కొత్తగా 316 ఫించన్లు మంజూరు

**ఉలవపాడు, ఆగస్టు1, ప్రభాతవార్త:** ఉలవపాడు మండలంలో ఆగస్టు1న ఫించన్ల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని ఎంపిపి, జడ్పీటీసీ, ఎంపిటీసీ, సర్పంచ్‌లు పలుచోట్ల జరిగిన ఈ కార్యక్రమానికి హాజరైయ్యారు. కొత్తగా మంజూరైన ఫించన్లను లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో 16గ్రామ సచివాలయాలకు సంబంధించి 316 ఫించన్లు మంజూరైయ్యాయి. వీటిని సోమవారం రోజు ఆయా గ్రామాలలోని లబ్ధిదారులకు అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎంపిడివో చెంచమ్మ, ఎంపీటీసీ ఫజల్, కోఆక్షన్ నంబర్ ఖాదర్‌బాషా, సర్పంచ్ నాగలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ఆజాదీక అమృత మహోత్సవం. ఉలవపాడు మండలంలో అన్ని పంచాయతీల్లో అజాదీక అమృత మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. పలు చోట్ల ర్యాలీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు హాజరైయ్యారు.

## కొమ్మిలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ



**కొండాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** కొండాపురం మండలంలోని కొమ్మి హైస్కూల్లో సోమవారం ఆజాదీకా అమృత్ మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ప్రజల్లో దేశభక్తి భావం, జాతీయపతాకం పట్ల అవగాహన పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. జాతీయజెండాను చేతబూని దేశభక్తి నినాదాలను చేస్తూ విద్యార్థుల్లో ఉత్సాహం నింపారు. 1నుండి15వ తేదీ వరకు హర్‌ఘర్ తిరంగ కార్యక్రమాలు వార్డు, గ్రామ, మండల స్థాయిల్లో నిర్వహిస్తారన్నారు. ప్రతి ఇంటిపైన మువ్వన్నెల జెండా సగర్వంగా ఎగురవేసేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. దేశ స్వతంత్ర పోరాటంలో అమరులైన ఎంతోమంది స్పూర్తిని హర్ ఘర్ తిరంగ ద్వారా చిన్నారుల్లో, యువతలో నింపాలన్నారు. ఈ విశేష వేడుక పౌరుల్లో మరోసారి దేశభక్తిని , జాతీయభావాన్ని రగిలించాలన్నారు. ఇందులో భాగంగా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకఉ హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమం నిర్వహణ కోసం రాష్ట్రంలో 2 జిల్లాలు ఎంపిక కాగా అందులో శ్రీ పొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా ఉండడం జిల్లాకు ఎంతో గర్వకారణం అన్నారు. ఈకార్యక్రమంలో భాగంగా జాతీయపతాకంతో సెల్ఫీలు దిగడంతో పాటు దేశభక్తిని పెంపొందించే విధంగా సదస్సులు, బృందచర్చలు వ్యాసరచనలు, క్విజ్, నాటకాలు లాంటి కళాత్మక రంగాల్లోపోటీలు నిర్వహించాలన్నారు. కొమ్మి హైస్కూల్ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం విద్యుల్లత, కొమ్మి మెయిన్ అంగన్‌వాడీ వర్కర్ కేవీ. అరుణ, దొరసాని, ద్రాకాయణి, ఆదిలక్ష్మి పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు, శ్రీనేతాజీవికాస్, శ్రీవివేకానంద, ఇతర పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన పెన్షన్లు అందజేసిన ఆనం ప్రసాద్‌రెడ్డి



**సంగం ఆగష్టు 1 ప్రభాతవార్త** సంగం మండలం వెంగారెడ్డిపాళెం గ్రామంలో గ్రామ సర్పంచ్,వైసిపి సీనియర్‌నాయకులు ఆనం ప్రసాద్‌రెడ్డి నూతన పెన్షన్లు పంపిణి చేశారు. ఈ సంద్భంగా ఆయన మాట్లాడుతు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మాటఇస్తే తప్పడని ప్రశంసించారు. భారతదేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి,సంక్షేమపధకాలు అమలు చేస్తున్నారని ప్రశంసించారు. ప్రస్తుతం 2500 వున్న పెన్షన్ మరి కొద్ది నెలలో 2750 కానున్నట్లు ఆయన తెలిపారు. గ్రామంలో కొత్తగా ఇప్పటి వరకు 150 పెన్షన్లు వున్నట్లు తెలిపారు. ప్రతి ఇంట్లో జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమపలాలు అందుతున్నాయని ఆయన స్పష్టం చేశారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి లక్ష్మీలావణ్య, వాలింటర్లు ప్రదీప్,శరణవాబాబు తదితరులున్నారు.

## ఉత్సాహంగా హర్ ఘర్ తిరంగ



**వింజమూరు, ఆగస్ట్1, ప్రభాతవార్త:** దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆజాదిక అమృత్ మహోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులచే హర్ ఘర్ తిరంగ కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో ఆజాదిక అమృత్ మహో త్సవాన్ని ఎంపిడిఓ స్వరూపరాణి , సర్పంచ్ నల్లగొండ్ల సృజన, ఎంఇఒ మాలకొండలరావ్‌లు మాట్లాడుతూ ప్రజల్లో దేశభక్తి భావం, జాతీయపతాకం పట్ల అవగాహన పెంపొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నా మన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల ఉపాధ్యాయులు, శ్రీనేతాజీవికాస్, శ్రీవివేకానంద, ఇతర పాఠశాలల్లోని ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టండి



**వింజమూరు, ఆగస్ట్1, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని బిసికాలనీలో నెలకొన్న రోడ్డు, డ్రైనేజీ , విద్యుత్ సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలని సోమవారం బిసికాలనీ మహిళలు తహసిల్దార్ చొప్పా రవీంద్రబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆప్రాంతవాసులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్ళుగా నివాసాలేర్పరచుకొని జీవనం సాగిస్తున్నామని ప్రతి సంవత్సరం పంచాయతీ పన్నులు కూడా చెల్లిస్తున్నామని కానీ ఈప్రాంత అభివృద్ధికి నేతలుకానీ అధికారులు కానీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు. ప్రతి సంవత్సరం వర్షాకాలంలో వర్షపునీరు నివాసాల్లోకి చేరి బురదమయమవుతుందన్నారు. కనీసం నివాసాలకు వెళ్ళే రహదారి కూడా లేకపోవడంతో బురదలో నడవాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఇటీవల కాలంలో అనేకమందికి కాళ్ళు, చేతులువిరిగిన సంఘటనలున్నాయన్నారు. ఉదయాన్నే పిల్లల్ని స్కూలుకు పంపేందుకు కూడా ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఏదో రకంగా కాలం గడుపుదామనుకున్నా కరెంటు స్థంభాలు లేక చీకట్లో పాముకాటుకు గురికావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తామే ప్రజా సమస్యలపట్ల అధికారిని కలిసి వినతిపత్రం అందజేస్తున్నా మన్నారు. తమ సమస్యను పరిష్కరించుకునేందుకు తాము సంఘటితంగా పోరాడేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. త్వరలోనే కార్యాలయాల ఎదుట బైఠాయించి ఆందోళన చేస్తామన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు ఏర్పాటు చేయాలని, విద్యుత్ స్థంభాలను వేయాలని, డ్రైనేజీని ఏర్పాటు చేయాలని వారు కోరారు.

## నూతన పెన్షన్లు పంపిణీ



**వింజమూరు, ఆగస్ట్1, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం పేదలకు మంజూరు చేసిన నూతన పెన్షన్లను సోమవారం సర్పంచ్ నల్లగొండ్ల సృజన, పిఎసిఎస్ చైర్మెన్ జూపల్లి రాజారావ్‌లు పెన ్షన్లు పంపిణీని లాంచనంగా సచి వాలయ సిబ్బందితో కలిసి లబ్ధిదారుల నివాసాలకు వెళ్ళి పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లా డుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో అర్హులైన పెన్షన్‌దా రులందరికీ నూతనంగా పెన్షన్లను మం జూరు చేసి అవ్వతాతల మొహంలో వెలుగులు నింపార న్నారు. వింజమూరు మండలానికి 230పెన్షన్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమాన్ని పండుగ వాతావరణంలో పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో సచివాలయ సిబ్బంది నారాయణ, వాలంటీర్ లు పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థను మార్చే లక్ష్యం నెరవేరుతుందా?



**నెల్లూరురూరల్, ఆగష్టు1 ప్రభాతవార్త** 2024 నాటికి విద్యావ్యవస్థను మార్చాలన్న లక్ష్యం నెరవేరుతుందా అని సోమవారం నెల్లూరు పార్లమెంటు సభ్యులు ఆదాల ప్రభాకరరెడ్డి పార్లమెంటులో ప్రశ్నించారు. సమగ్రశిక్షాఅభియాన్ కింద ఆంధ్రప్రదేశ్‌కు ఏమాత్రం సాయం అందించారని మరో ప్రశ్న వేశారు. అందుకు కేంద్ర ఉన్నత విద్యాశాఖ ఉపమంత్రి అన్నపూర్ణాదేవి రాతపూర్వకంగా సమాధానమిచ్చారు. వృత్తి, సాధారణ విద్యలను ఏకీకృతం చేయడమే లక్ష్యమ న్నారు. సమగ్రశిక్షాఅభియాన్ కింద పుస్తకాలు, పరికరాలకు రాష్ట్రాలకు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. అంతేకాకుండా మార్గదర్శకాలతో పాఠ్యపుస్తకాలను అభివృద్ధి చేస్తామన్నారు. ఎపిలో 606 పాఠశాలలను అందుకు ఆమోదించామన్నారు.

## కొమ్మిలో తల్లిపాల వారోత్సవాలు




**కొండాపురం, ఆగస్టు 1 ప్రభాతవార్త:** కొండాపురం మండలంలోని కొమ్మి మెయిన్ అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం రాయలీ, సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్‌కే, అంగన్‌వాడీ వర్కర్ కేవీ.అరుణ, దొరసాని, ద్రాక్షాయణి, ఆదిలక్ష్మి, దొరసాని, గర్భిణులు, తల్లులుపాల్గొన్నారు.

## ఆజాదికా అమృత మహోత్సవాల్లో అందరు పాల్గొనాలి



**కావలి రూరల్, ఆగస్టు 1 ప్రభాతవార్త** భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆగస్టు 1 నుండి 15వ తేది వరకు జరుగుతున్న ఆజాదికా అమృత మహోత్సవాల కార్యక్ర మాలలో అందరు పాల్గొ విజయవంతం చేయాలని కావలి ఎంపిడివో అమ్మిశెట్టి వెంకట సుబ్బారావు కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేపట్టిన హర్ ఘర్ తిరంగా కార్యక్రమం సందర్భంగా కావలి రూరల్ మండలం గౌరవరం సచివాలయం వద్ద సోమవారం ఏర్పాటు చేసిన ర్యాలీని ఎంపిడివో ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ దేవరపల్లి రాధిక, కార్యదర్శి రవిచంద్రకుమార్, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి ఆయన ప్రతి ఇంటికి వెళ్ళి ఈ కార్యక్రమ విశిష్టతను తెలియజేశారు.

## తహాశీల్దార్‌కి వినతి పత్రం అందజేసిన టిడిపి శ్రేణులు



**అల్లూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త** టిడిపి నాయకులు బీద గిరిధర్ ఆధ్వర్యంలో అల్లూరు మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు మండలంలోని ప్రజలకు కరోనా బియ్యం సక్రమంగా పంపిణీ చేయలేదని తహాశీల్దార్ శ్రీరామకృష్ణకు వినతి పత్రం అందజేశారు. అల్లూరు పాతబస్టాండ్ సెంటర్ నుండి టిడిపి నాయకులు, కార్యకర్తలు తెలుగుదేశం పార్టీ జెండాలు చేతపట్టుకొని నిరసన ర్యాలీని తహాశీల్దార్ కార్యాలయం వరకు నిర్వహించారు. ఈ సందర్భంగా బీద గిరిధర్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కరోనా కష్టకాలంలో ఉచితంగా బియ్యం అందజేస్తే ఏప్రిల్ నుంచి జులై వరకు రాష్ట్ర ప్రభుత్వం పంపిణీ చేయకుండా ప్రజల్ని మోసం చేసిందన్నారు. అల్లూరు మండలంలో 16 వేల మంది తెల్లరేషన్‌కార్డులు కలిగి వుంటే కేవలం 8 వేల తెల్లరేషన్‌కార్డుల మందికి మాత్రమే వాలంటీర్ల ద్వారా రైస్ కూపన్లు పంపిణీ చేస్తున్నారన్నారు. సంక్రాంతి, రంజాన్ కానుకలను పూర్తిగా నిలిపివేశారన్నారు. అనంతరం తహాశీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అల్లూరు టిడిపి మండల అధ్యక్షులు బండి శ్రీనివాసులురెడ్డి, పోలుశెట్టి, బుర్లా కృష్ణారెడ్డి, అలగర రమణయ్య, తోట శ్రీహరి, జగన్, జనార్ధన్, టిడిపి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## అల్లూరు మండలంలో కొత్త పింఛన్లు పంపిణీ

**అల్లూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త** అల్లూరు మండలంలోని నగర పంచాయతీ, మిగిలిన పది పంచాయతీలలో సోమవారం కొత్త పింఛన్లను ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఆరు నెలలకు ఒకసారి వితంతు,వృద్ధాప్య, ఒంటరి మహిళల కొత్తపింఛన్లను మంజూరు చేసింది. అల్లూరు మండలంలోని అన్ని పంచాయతీలలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, వైసిపి నాయకులు పంపిణీ చేయగా లబ్దిపొందిన పింఛన్‌దారులు ఆనందం వ్యక్తం చేశారు.

## సబ్సిడీపై విత్తనాలు

**జలదంకి, ఆగస్టు1, ప్రభాతవార్తః** మండలంలోని ఆయా గ్రామలలోని రైతుబరోసా కేంద్రాలలో సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్నట్లు వ్యవసాయాదికారిణి శైలజ సోమవారం ఒకప్రకటనలో తెలియ జేశారు. యాబై శాతం సబ్సిడీపై జీలుగ,జనుము,పిల్లిపెసరలు సరఫరా చేస్తున్నామని చెప్పారు. పది కేజీల జీలుగలు 320,జనుము పది కెజీలు430,8కెజీల పిల్లిపెసర్లు351 రూపాయలకే ఇస్తున్నట్లు ఆమె తెలిపారు. కావలసిన వారు పట్టాదార్ పాస్‌బుక్,ఆదార్ కార్డులు తీసుకొని సంబందిత కేంద్రాలను సంప్రదిం చాలని వివరించారు. అలాగే కౌలుదారులు వి.ఆర్.ఒలు జారీచేసిన హక్కు కార్డులను పొంది సి.సి.ఆర్.సి పొందాలని సూచించారు. దీనిద్వారా ఇపంట నమోదు,రైతుబరోసా,పంటలభీమా, బ్యాంకు రుణాలు పొందేందుకు అర్హులని అన్నారు కావున ప్రతి ఒక్క కౌలురైతు తప్పనిసరిగా కౌలుహక్కు కార్డులను పొందాలని తెలియ జేశారు.

## జగన్స్ కాలేజీ గుర్తింపు రద్దుచేయాలంటూ ధర్నా




**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** విద్యార్థి ఆత్మహత్యాయత్నానికి కారణమైన నెల్లూరు రామలింగాపురంలోని జగన్స్ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ధర్నాలో పాల్గొన్న ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శులైన సిరాజ్, మస్తాన్‌లు ఈ సందర్భంగా మాట్లాడుతూ మెహరాజ్ అనే విద్యార్థి జగన్స్ కాలేజీలో బీబీఏ మొదటికోర్సు చదువుతున్నాడని పరీక్ష ఫీజు కట్టిన అతనికి కాలేజీ యాజమాన్యం హాల్ టిక్కెట్ ఇవ్వలేదన్నారు. హాల్‌టిక్కెట్ ఎక్కడో మిస్సయిందని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో మనస్తాపానికి గురై మెహరాజ్ ఆత్మహత్యానికి పాల్పడ్డాడన్న ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శులు ఇందుకు కారణమైన వారిపై చర్య తీసుకోవడంతోపాటు ఆ కాలేజీ గుర్తింపు రద్దు చేయాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ మేరకు నినాదాలు చేసిన ఏఐఎస్‌ఎఫ్ ప్రతినిధులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో అధికారులకు అందజేశారు.

## కలెక్టరేట్ వద్ద కలువాయి మత్స్యకారుల ధర్నా



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** నిబంధనలకు విరుద్ధంగా జరిగిన కలువాయి మత్స్యకార సొసైటీ ఎన్నికలు రద్దు చేయాలని..ఎన్నికల అధికారిగా వ్యవహరించిన సుధాభారతిని సస్పెండ్ చేయాలని...సొసైటీకి తిరిగి ఎన్నికలు జరపాలని డిమాండ్ చేస్తూ కలువాయి మత్స్యకారులు సోమవారం కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. మత్స్యశాఖ తమకు అందజేసిన గుర్తింపుకార్డులు చేతబట్టి గాంధీబొమ్మ నుండి నినాదాలు చేసుకుంటూ కలెక్టరేట్‌కు వచ్చిన మత్స్యకారులు అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వజ్రాల శ్రీనివాసులు తదితరులు మాట్లాడుతూ హైకోర్టు ఆదేశాల మేరకు కలువాయి మత్స్యకార సొసైటీ ఎన్నికల నిర్వహణ చేపట్టిన జిల్లా యంత్రాంగం డిప్యూటీ రిజిస్ట్రార్, ఎన్‌డీసీసీబీ ఓఎస్‌డీ అంజిరెడ్డిని ఎన్నికల అధికారిగా నియమించి ఎన్నికలకు ముందురోజే ఆ స్థానంలో డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ సుధాభారతిని నియమించిందన్నారు. సొసైటీలో మొత్తం 140 మంది సభ్యులుండగా 88 మంది సభ్యుల మద్దతున్న వారిని డైరక్టర్లుగా ఎన్నికైనట్లు ప్రకటించకుండా మిగిలిన 52 మంది సభ్యుల మద్దతున్న వారిని డైరక్టర్లుగా ఎన్నికైనట్లు సుధాభారతి ప్రకటించడం జరిగిందన్నారు. రాజకీయ నాయకులతో కుమ్మక్కై చట్టవిరుద్ధంగా వ్యవహరించిన సుధాభారతిని సస్పెండ్ చేయడంతోపాటు మోసపూరితంగా జరిగిన ఎన్నికలను రద్దుచేసి తిరిగి ఎన్నికలు జరపాలని తాము డిమాండ్ చేస్తున్నామన్నారు. ఈ మేరకు నినాదాలు చేసిన కలువాయి మత్స్యకారులు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని స్పందనలో అధికారులకు అందజేశారు.

## నూతన పించన్లు పింపిణీ



వరికుంటపాడు, ఆగస్టు1, ప్రభాతవార్తః మండలంలో పూతనంగా మంజూరైన 144పెన్షన్లను ఆయా గ్రామాలలో సర్పంచ్‌లు వై.సి.పి నాయకులు పంపిణీ చేశారు. మండలంలోని తూర్పుబోయమడుగుల గ్రామంలో సర్పంచ్ చల్లకొలుసు.నాగరాజు,వైకాపా నేతలు మాగంటి.శ్రీనివాసులు,కుందూరు కొండయ్య,వెల్ఫేర్ అసిస్టెంట్ ఉప్పుటూరి బాలగంగులులు పంపిణీచేశారు. అలాగే కాంచెరువు గ్రామంలో సర్పంచ్ మందలపు.మల్లీశ్వ రి,వై.సి.పి నేత మందలపు.తిరుపతినాయుడు పంచాయతీ కార్యదర్శి జిలానీ,వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకయ్య బాబు,వి.ఎ.ఎ ఆతిత్యవరికుంటపాడులో సర్పంచ్ కొండెపోగు.దిలీప్ కుమార్,ఎం.పి.డి.ఒ విజయభాస్కర్ రావు,వై.సి.పి మండల కన్వీనర్ అంద్రా.బాలగురవారెడ్డి,సొసైటి అధ్యక్షుడు కామేపల్లి.వెంకటరత్నం,వెల్ఫేర్ అసిస్టెంట్ షంషీర్ గణేశ్వరాపరంలో సర్పంచ్ తిరుపతయ్య,వై.కా.పా నేత పాదం.వెంకటనారా యణరెడ్డి,జి.కొండారెడ్డిపల్లిలో సర్పంచ్ కుమ్మిత ప్రతాప్‌రెడ్డి,పంచాయతీ కార్యదర్శి శివకుమార్,వెల్ఫేర్ అసిస్టెంట్ మహేష్‌లు పంపిణీ చేశారు.

## ఆజాదికా అమృత్ మహోత్సవంపై అవగాహన



**వరికుంటపాడు, ఆగస్టు1, ప్రభాతవార్తః** కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు అయినందున నిర్వహిస్తున్న ఆజాదికా అమృత్ మహోత్సవంపైసోమవారం వరికుంటపాడులో అవగాహన కల్పించడంతో పాటు విద్యార్దులతో కలసి త్రివర్ణ పతాకాన్ని చేతబూని ర్యాలీ నిర్వ హించారు. ఈకార్యక్రమానికి ముఖ్యఅతిధిగా విచ్చేసిన వరికుంటపాడు జట్.పి.టి సభ్యులు రావెళ్ళ.నాగేంద్ర మాట్లాడుతూ దేశం కోసం ఎంతోమంది స్వాతంత్ర్య సమరయోధులు పోరాటం చేసి స్వాతంత్ర్యాన్ని తీసుకువచ్చారన్నారు. ఈకార్యక్రమంలో ఎం.పి.డి.ఒ విజయభాస్కర్‌రావుఎం.ఇ.ఒ షావుద్దీన్ ,వై.కా.పా మండల కన్వీనర్ అంద్రా.బాలగురువారెడ్డి,సొసైటి అధ్యక్షుడు కామేపల్లి.వెంకటరత్నం,ఎ.పి.ఎం వైనారూత్,పాఠశాల ప్రదానోపాద్యాయులు శ్రీనివాసులరెడ్డి కాంతారావు,వై.కా.పా నేతలు విద్యార్దినీ,విద్యా ర్దులు పాల్గొన్నారు.

## ధరలను నియంత్రించడంలో వై.సి.పి ప్రభుత్వం విఫలం



**వరికుంటపాడు, ఆగస్టు1, ప్రభాతవార్తః** సామాన్య ప్రజలకు పెనుభారంగా మారిన నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించడంలో వై.కా.పా ప్రభుత్వం విఫలమైందని తెలుగుదేశం పార్టీమండల ప్రధానకార్యదర్శి పోలుబోయిన శ్రీకాంత్ యాదవ్ అన్నారు. సోమవారం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా.చంద్రబాబు నాయుడు,రాష్ట్ర అధ్యక్షుడు అచ్చంనాయుడు,మాజీ ఎం.ఎల్.ఎబొల్లినేని.రామారావు అదేశానుసారం ధరల పెరుగుదలను నియంత్రించాలంటూ మరియు రేషన్ షోపులలో గతంలో అందిస్తున్న 8రకాల వస్తువులను ఇవ్వాలంటూ తహసిల్‌దారుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ప్రభుత్వం రేషన్ షాపులలో బియ్యం తప్ప ఏమి ఇవ్వడంలేదని గత ప్రభుత్వ హయాంలో తక్కువ ధరకు 8రకాల వస్తువులను అందించేవారమన్నారు. కేంద్ర ప్రభుత్వం ఉచితంగా రేషన్‌బియ్యం పంపిణీచేస్తుంటే వైకాపా ప్రభుత్వం ఆపివేసిందని ఎద్దేవాచేశారు. వస్తువులపై ధరలను తగ్గించాలని డిమాండ్ చేశారు. మాజీ ఎం.పి.టి.సి ఆరోన్,టిడపి నేతలు తాతపూడి.లాబాన్,నల్లగొర్ల. వెంగళరావు, మహేష్, కొండలరావు పాల్గొన్నారు.

## వైసీపీ ప్రభుత్వంలో రేషన్ దుకాణాలు నిర్వీర్యం



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త :** వైసీపీ ప్రభుత్వంలో రేషన్ వ్యవస్థ పూర్తిగా నిర్వీర్యం చేశారని, చక్కెర, కందిపప్పు కూడా కార్డు దారులకు సక్రమంగా అందివ్వలేని పరిస్థితిలో సంబంధిత శాఖ ఉందని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. కోవూరులోని తహసీల్దార్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం కోవూరు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే పోలంరెడ్డి శ్రీనివాసులురెడ్డి పిలుపుతో టీడీపీ నాయకులు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అందించే ఉచిత బియ్యాన్ని ప్రతి కార్డుదారునికి ఇవ్వాలన్నారు. కేవలం కొంతమందికే ఇచ్చి చేతులు దులుపుకోవడం సరికాదన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్‌కు వినతిపత్రం అందజేశారు. టీడీపీ నేతలు మల్లారెడ్డి, బాలరవి, సుదాకర్, మందా రవి, సుధాకర్‌రెడ్డి, ఎన్. వెంకట్, సూరిశెట్టి శ్రీనివాసులు, వై. నాగరాజు, జహంగీర్, సాధిక్, గౌస్, టవి కుమార్, వెంకటేశ్వర్లు, మహేష్, శ్రీనివాసులు, శివప్రసాద్ ఆచారి, రామచంద్రారెడ్డి, సూర్యం, ఉన్నారు.

## పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త :** కోవూరులోని ఎంపీడీవో కార్యాలయాన్ని సోమవారం జిల్లా పరిషత్ సీఈవో వాణి ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె పలు రికార్డులు పరి శీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భం గా ఆమె మాట్లాడుతూ మండలంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదేవి ధంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్ర మాన్ని పూర్తిస్థాయిలో విజయవంతం చేసేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. అదేవిధంగా ఈ సీజన్‌లో వచ్చే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించేలా పంచాయతీ కార్యదర్శులు తగు చొరవ తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీహరి, ఈవోపీఆర్డీ కల్పన, కార్యాలయ పర్యవేక్షకులు చంద్రశేఖర్, ఉన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు పంపిణీ

**వింజమూరు, ఆగస్ట్1, ప్రభాతవార్త:** వింజమూరు మండలంలో పలు పంచాయతీల్లోని బాధితులకు మంజూరైన సిఎం రిలీఫ్ ఫండ్‌ను సోమవారం పిఎసిఎస్ కార్యాలయంలో చైర్మెన్ జూపల్లిరాజారావ్ బాధితులకు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని పలువురు వివిధ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చులకు ముఖ్యమంత్రి సహాయ నిధికి ఎమ్మెల్యే మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి ద్వారా దరఖాస్తు చేసుకున్న 7మందికి 3.20లక్షల రూపాయలు మంజూరయ్యాయని అందులో భాగంగా చెక్‌ను పంపిణీ చేశారు. నందిగుంటకు చెందిన చిలకల వెంకటరెడ్డికి 30వేలు, ఆరవీటి కిస్తీపురంకు చెందిన లక్కు కాంతమ్మకు 65వేల రూపాయలు, చింతలపాళెంకు చెందిన కర్లపూడి మాల్యాద్రికి 48వేలరూపాయలు, శంఖవరంకు చెందిన వి.రమణమ్మకు 35వేల రూపాయలు , యర్రబల్లిపాళెంకు చెందిన సునీతకు 18వేల రూపాయలు , శంఖవరంకు చెందిన భూమిరెడ్డి వెంకటకొండయ్యకు 90వేల రూపాయలు , కాటేపల్లికి చెందిన చిరిపిరెడ్డి వెంగళరెడ్డికి 35వేలరూపాయల చెక్కులను ఎమ్మెల్యే ద్వారా ఆయా ప్రాంతాల ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు.

## జగన్‌మోహన్‌రెడ్డికి మాకుటుంబంటే చాలా అభిమానం



**బుచ్చి ఆగష్టు 1 ప్రభాతవార్త** ప్రసన్నకుమార్‌రెడ్డిని జగన్‌మోహన్‌రెడ్డి దూరపెట్టాడు..... ఈయన గడగడ పకు తిరగడంలేదు.... ఆయనకు ఈ సారి సీటురాదు....అంటు కొంతమంది కావాలని రకరకాల దుష్ప్రా రులు చేస్తున్నారని కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి తెలిపారు. జొన్నవాడలో అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంబించిన అనంతరం గడగడపకు కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడుతు కొంతమంది యూట్యూబ్‌లో నాపైన లేని పోని దుష్ప్రారులు చేస్తున్నారని అన్నారు. నాకు ఎ దమకాలు బాగులేక చెన్నై అపోలో హాస్పటల్, హైదరాబాద్ అపోలో హాస్పటల్‌లో చూపించుకుంటే ఇంజక్షన్ చేయించుకోవాలని 10 రోజులు రెస్టు తీసుకోవాలని చెప్పారు. ఆవిషయం తెలుసుకున్న జగన్‌మోహన్‌రెడ్డి అ న్నా మీరు గడగడప కార్యక్రమానికి తిరగవద్దు రజిత్‌కుమార్‌రెడ్డిని తిప్పమన్నారు అని చెప్పారు. జగన్ మోహన్‌రెడ్డి నేనంటే చాలా అభిమానం, నాకుమారుడు అంటే మరింత అభిమానం ఆయన ఎప్పటికి మమ్మ ల్ని దూరం చేసుకోరని అన్నారు. కొంతమంది కావాలని విషప్రచారాలు చేస్తున్నారని దానిని ఎవ్వరు నమ్మరని అన్నారు. నాకు ఎంత ఆరోగ్యం బాగులేకపోయినా గడగడపకు కార్యక్రమాన్ని పూర్తి స్థాయిలో నెరవేరుస్తానని చెప్పారు. నిత్యం ప్రజలలోనే వుంటాను అని చెప్పారు. నేను కాలినొప్పతో ఎంత బాధపడుతున్నాను నాకు తెలుసు. జగన్‌మోహన్‌రెడ్డికోసం ఎంత కష్టమైనా పనిచేస్తాం. దివంగతనేత రాజశేఖర్‌రెడ్డి మృతి చెందిన తరువాత చిన్నవయస్సులో అంతపెద్ద పాదయాత్ర చేసి జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మనస్సు దోచుకున్నాడని ప్రశంసించారు. గడగడప కార్యక్రమానికి వెళితే ప్రజలు ఆప్యాయతతో ఆదరిస్తున్నారని అన్నారు. శ్రీమల్లికార్జునస్వామి, కామాక్షితాయి సన్నిధి నుండి గడగడపకు కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని అన్నారు. మూడు సంవత్సరాలలో లక్షా 50 కోట్ల రూపాయాలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పధకాలకు ఇవ్వడం జరిగిందని అన్నారు. గడపగడపకు కార్యక్రమం ద్వారా ఇంటింటికి వెళ్లి ఇంకా అర్హులై ఉండి కూడా సంక్షేమపథకాలు అందకపోతే వారికి సంక్షేమపథకాలు అందేలా చూడడమే ఉద్దేశమని చెప్పారు. నవంబర్, డిసెంబర్ నెలలో వచ్చిన వరదలకు జొన్నవాడ వద్ద పొర్లుకట్ట తెగిపోయి తీవ్రనష్టం వాటల్లింది. అందుకుగాను ఎప్‌డిఆర్ నిదుల కోటి 90 లక్షల రూపాయాలతో పొర్లుకట్టలు బాగు చేయించాం. అలాగే టెంపుల్ చుట్టు రక్షణగోడకోసం కోటి 40 లక్షల రూపాయాలతో ప్రహరీ గోడ మంజూరు చేయించాం. టెండర్లు పూర్తి అయ్యాయి. త్వరలో పనులు ప్రారంభిస్తామని అన్నారు. 20 రోజులు నియోజకవర్గంలో గ్రామాలు పర్యటించి ముఖ్యమంత్రి అమలు చేస్తున్న సంక్షేమపథకాలు వివరిస్తాం. ప్రతి సచివాలయానికి ఇటీవల 20 లక్షలు మంజూరు చేయడం జరిగింది. దీనిని అవసరమైన చోట వినియోగిస్తామని చెప్పారు. ప్రజలందరికి నిత్యం అందుబాటులో వుండి మానాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమపథకాలు గురించి వివరిస్తామని అన్నారు. ఈకార్యక్రమంలో నల్లపరెడ్డి రాజేంద్రకుమార్‌రెడ్డి, నల్లపరెడ్డి రజిత్‌కుమార్‌రెడ్డి, జిల్లావ్యవసా య మార్కెటిగ్ చైర్మన్ దొడ్డం రెడ్డి నిరంజన్‌బాబురెడ్డి, డిఎల్‌డిఎ చైర్మన్ వీరి చలపతిరావు, సీని యర్ నాయకులు పచ్చిపాల రాధాకృష్ణారెడ్డి, తహసిల్దారు శ్రీనివాసరావు, ఎంపిడిఓ నరసింహారావు, మావూలూరు శ్రీనివాసులురెడ్డి, వవ్వేరు బ్యాంకు చైర్మన్ సూరా శ్రీనివాసులురెడ్డి, జడ్‌పిటిసి మెంబర్ సూరా ప్రదీప, ఎంపిపి మన్నెపల్లి శ్రీనివాసులు, బుచ్చిరెడ్డిపాలెం నగరపాలక చైర్మన్ మోర్ల సుప్రజ, టౌన్ అద్యక్షులు టంగుటూరు మల్లికార్జునరెడ్డి, పెన్నాడెల్టా ప్రాజక్టు మాజీ చైర్మన్ యర్రంరెడ్డి గోవర్ధన్‌రెడ్డి, జొన్నవాడ నాయకులు పిళ్ళళ్ళ మురళీ, సాగర్, మండల ఉపాధ్యాక్షులు నాటూరు బాలకృష్ణ, ట్రస్టు బోర్డు మెంబర్ ముంగరశివకు మార్, పెనుబల్లి సర్పంచ్ ఓడా పెంచలయ్య, కోవూరు మార్కెటింగ్ డైరక్టర్ జొన్నవాడ ప్రసాద్, కౌన్సిలర్లు షేక్ షకిలాబేగం, అందె ప్రత్యూషా, రాచూరు సత్యనారాయణ, శివకుమార్‌రెడ్డి, బెళం మల్లారెడ్డి, మండలపార్టీ అద్యక్షులు చెర్లో సతీష్‌రెడ్డి, ఆర్‌కె రవి, బట్టా ప్రళిక, డాక్టర్ అల్లాబక్సు, రేబాల మాజీ సర్పంచ్ శ్రీని వాసు లురెడ్డి, దామరమడుగునాయకులు అహ్మద్, 5మండలాల నాయకులు, ప్రజాప్రతినిదులు వైసిపి నాయకు లు, కార్యకర్తలు ఈకార్యక్రమంలో పాల్గోన్నారు.

## శ్రీప్రసన్న ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు



**వింజమూరు, ఆగస్ట్1, ప్రభాతవార్త:** వింజమూరు పంచాయతీ పరిధిలోని జిబికెఆర్ ఎస్టీకాలనీ సమీపంలో శ్రీసీతాలక్ష్మణ హనుమంత్ సమేత శ్రీరామచంద్రస్వామి విగ్రహ, శ్రీ అభయాంజనేయస్వామి వాయు విగ్రహ శిఖల కలశ ప్రతిష్ట మహాకుంభాభిషేక కార్యక్రమంలో భాగంగా సోమవారం శ్రీమహాగణపతి పూజ, పుణ్యాహవచనం, భూశుద్ధి, లోక శుద్ధి, ద్రవశుద్ధి, రక్షాబంధనం, దీక్షా స్వీకరణ కార్యక్రమాలను రాధామనోహర్‌దాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మానవజన్మ అనేది భగవంతుడిని తెలుసుకునేందుకు ఉత్తమమైన అవకాశమని, దాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరిలో నేను అనే భావం పోయి మనం అనే భావన వచ్చినప్పుడు అందరూ సుఖ సంతోషాలతో జీవితాన్ని గడుపుతారన్నారు. దేవాలయాలు ఎందుకు నిర్మించాలంటే మనిషిలోని చెడు గుణాలను పోగొట్టేందుకేనన్నారు. అందరూ భగవంతుడ్ని స్మరించాలన్నారు. అంతేకాకుండా గిరిజన మఠం భక్తబృందం ఆంజనేయస్వామి వాయువిగ్రహాన్ని ఏర్పాటు చేయడం ఎంతో ఆనందకరమన్నారు. హిందూధర్మం మన దినచర్యను సూచిస్తుందన్నారు. స్వామివారి సేవలు మహాపుణ్యమన్నారు. పసుపులేటి భవానిశర్మ, నూతలపాటి జయమ్మ, చౌటూరు పార్వతమ్మ, యాకశిరి భవాని, అల్లూరి వాణి, అమరగిరి భారతి, మల్లీశ్వరి, ఆదిలక్ష్మి, కాంతమ్మ, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

## ఇంద్రాక్షి అమ్మవారి ఆలయ అర్చకునికి అరుదైన గౌరవం



**మర్రిపాడు, ఆగస్ట్1, ప్రభా తవార్త** : చంచులూ రు లోని ఇంద్రాక్షి అమ్మవారి దేవస్థాన అర్చకులు పలుకూరి మురళీ కృష్ణమాచార్యులకు అరుదైన పురస్కారం లభించింది. హైదరాబాదులోని లలిత కళాసేవ సామాజిక సంస్థ, రుద్రాక్ష వైభవం ఆధ్యాత్మిక పీఠంవారు కలసి సువర్ణ కంకణంతో సత్కరించి సామవేద శిరోమణి బిరు దును ప్రధానం చేశారు. వీరు వేద పాఠశాలలో ఇరవై సంవత్సరాలుగా విద్యనభ్యసించి వేదాలను అధ్యయ నం చేసి ప్రస్తుతం చంచులూరులోని ఇంద్రాక్షి అమ్మ వారి ఆలయ అర్చకులుగా విశేష సేవలు అందిస్తు న్నా రు. వీరు అన్ని రకాల పూజా కార్యక్రమాలు, ఆలయ ప్రతిష్టలు, యజ్ఞ, యాగాదులు, క్రతువులు, వివాహాది శుభకార్యాలు, శాంతిహోమాలు, జాతకాలు వ్రాయడం తదితర కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించడంలో మంచి పేరు ప్రఖ్యాతలు సంపాదించి అందరి మన్ననలు పొందుతూ హైందవ సంస్కృతి, సంప్రదాయాలను నిలబెట్టడానికి ఎనలేని కృషి చేస్తున్నారు. వీరికి అవార్డు రావడం పట్ల చంచులూరు గ్రామ ప్రజలు బంధు మిత్రులు అనందం వ్యక్తం చేస్తూ వారికి అభినందనలు తెలిపారు.

## లక్షా 50 వేల కోట్లతో సంక్షేమపధకాలు



**విడవలూరు ఆగష్టు 1 ప్రభాతవార్త** విడవలూరు కళ్యాణ మండపంలో కొ త్తగా మంజూరైన 220 మందికి కోవూరు శాసనస భ్యులు నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేతుల మీ దుగా పెన్షన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతు భారతదేశ చరిత్రలో ఒక్క లక్షా 50 వేల కోట్ల రూపాయాలు సంక్షేమపధకాలకు వెచ్చించిన ఘనత సిఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని అన్నారు. గత ప్రభుత్వంలో పెన్షన్లు కోసం టిడిపి నాయకుల ఇండ్ల చుట్టు తిరిగే వారని నేడు మీ ఇందికి వచ్చి వాలింటర్లు పెన్షన్ ఇస్తున్నారని తెలిపారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన హామిలను మేనిపెస్టో ప్రకారం హామిలు నెరవేరుస్తు పరిపాలిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలోని ప్రతి కుటుంబం ఏదోఒక సంక్షేమ పథకం ద్వారా లబ్ధిపొందాలని గడప, గడప మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రతి గృహంలోఇ లబ్ధిపొందిన కుటుం బాలు ఆనందపడుతున్నాయని అన్నారు. ఈకార్యక్రమంలో వైసిపి నాయకులు కె అచ్యుత్‌రెడ్డి, బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, కాటంరెడ్డి నవీన్‌రెడ్డి, వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గోన్నారు.

## నందీశ్వరుడుకి నూతన రాతి మండపం ప్రారంభం



**బుచ్చి ఆగష్టు 1 ప్రభాతవార్త** జొన్నవాడలోని శ్రీమల్లికార్జునస్వామి కామాక్షితాయి ప్రాంగణంలో పునః నిర్మించబడిన నూతన అధికార రాతి మండపం మరియు నూతన రాతి సింహానకు ప్రత్యేకపూజలు, సంప్రోక్షణ కార్యక్రమాన్ని అర్చకులు వేదమంత్రోచ్చరణ నడుమ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఉభయకర్తలుగా చంద్రశేఖర్, సుహాసిని వ్యవహరించారు. కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి నూతన అధికారరాతి నందిమండపం, రాతి సింహము ప్రారంబోత్సవం చేశారు. ఈ సందర్భంగా దేవస్థానం చైర్మన్ పుట్టా సుబ్రమణ్యంనాయుడు, ఆయన సతీమణి పుట్టా లక్ష్మీకాంతమ్మ, కార్యనిర్వహణాధికారి డబ్బుగుంట వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు తిరువాయిపాటి నందకుమార్, గుమ్మ రఘురామ య్య, ముంగరశివకుమార్, తిరుమూరు సు ప్రజారెడ్డి, బట్టేపాటి విజయమ్మ, ఆములూరు విమల, గుంటూరు కామే శ్వరీ, కాగోల్లు పద్మ, ఎక్స్ అఫిషియా సభ్యులు శ్రీశైలం శశిశేఖర్‌శర్మ, ఎమ్మెల్యేని ఘనంగా ఎమ్మెల్యేని ఆహ్వా నించారు. అనంతరం వారి గోత్రనామాలతో పూజలు నిర్వహించి ప్రసాదాలు అందజేశారు. ఈకార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు పాల్గోన్నారు.

## జాతీయ జెండాలతో కావలిలో ర్యాలీ



**కావలి, ఆగస్టు 1 ప్రభాతవార్త** ఆజాదికా అమృత మహోత్సవ్ హర ఘర్ తిరంగ కార్యక్రమంలో భాగంగా సోమవారం కావలి పట్టణంలో అధికారులు జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ కావలి ఆర్డీవో కార్యాలయం నుంచి పట్టణ జాతీయ రహదారి పురవీధులలో సాగింది. ఆర్డీవో శీనానాయక్, మున్సిపల్ కమిషనర్ బి. శివారెడ్డిలు పాల్గొని మాట్లాడారు. రెడ్‌క్రాస్ బాధ్యులు డాకారపు రవిప్రకాష్, గంధం ప్రసన్నాంజనేయులు, దామిశెట్టి సుధీర్‌నాయుడు, సామాజిక కార్యకర్త యం. మాలకొండారెడ్డి, సచివాలయ కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలతో చేపట్టిన ఈ ర్యాలీ అందర్ని ఆకర్షించింది.

## ఓటరు కార్డుతో అధార్ అనుసంధానం



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాతవార్త :** ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం కార్యక్రమానికి అన్ని రాజకీయ పార్టీలు పూర్తిస్థాయిలో సహకరించాలని జెడ్పీ సీఈవో వాణి తెలిపారు. కోవూరులోని తహసీల్దార్ కార్యా లయంలో సోమవారం అన్ని రాజకీయ పార్టీ నాయకులతో దీనిపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ప్రస్తుతం ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం ప్రక్రియను చేపట్టాలని ఆదేశించిందన్నారు. కోవూరు నియోజకవర్గంలో మొత్తం 323 పోలింగ్ బూత్‌లు ఉన్నాయని ఈ సందర్భంగా ఆమె తెలియజేశారు. ఈ అనుసంధానం ప్రక్రియ వలన డబుల్ ఎంట్రీలు, డెత్‌లు ఆటోమేటిక్‌గా తొలగి పోతాయన్నారు. ఓటర్లు ఈ కార్యక్రమాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకుని ఈమ ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం చేసుకోవాలని ఈ సందర్భంగా ఆమె సూచించారు. అదే విధంగా ప్రస్తుతం ఎన్నికల కమిషన్ 17 సంవత్సరాలు దాటిన ప్రతి యువకుడు ఓటుకు నమోదు చేసుకునే అవకాశం కల్పించిందన్నారు. దీనికి సంబంధించి జూనియర్ కళాశాల డిగ్రీ కళాశాలల విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ప్రక్రియ నూరుశాతం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి తహసీల్దార్ సీహెచ్ సుబ్బయ్య ఓటు నమోదు, మార్పులు, తొలగింపులు కార్యక్రమంపై రాజకీయ పార్టీ నాయకులకు, గ్రామ రెవెన్యూ అధికారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ ఇలియాజ్, ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఉరూస్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు రాకేష్, రమణయ్య, వివిధ పార్టీల నేతలు టి. సుధాకర్, ఐ. మల్లారెడ్డి, సీహెచ్ రఘురామయ్య, జి. శేషయ్య, టి. శంకర్, అంజన్‌రావు, మహేష్‌రెడ్డి, గ్రామ రెవెన్యూ అధికారులు ఉన్నారు.

## 80 లక్షల వ్యయంతో ఆలయ జీర్ణోద్దరణ పనులు



**కోవూరు, ఆగస్టు 1 ప్రభాత వార్త :** కోవూరులోని గాంధీ పార్కు సెంటర్‌లో వెలసి ఉన్న శ్రీ కోదండరామస్వామి దేవస్థానంలో ఆలయ జీర్ణోద్దరణ పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఆలయ చైర్మన్ కాటంరెడ్డి కృష్ణారెడ్డి ప్రత్యేకంగా చొరవ తీసుకుని సుమారు 80 లక్షల వ్య యంతో నూతన ఆలయ నిర్మాణప నులను వేగవంతంఅయ్యేలా తమ వంతు చర్యలు తీసుకుంటున్నారు. 20 24 ఫిబ్రవరిలోగా ఈ నిర్మాణ పనులు పూర్తిచేసేలా ప్రణాళికలు కూడా రూపొందించారు. ఈ కార్యక్రమంలో మాజీ సీడీసీ చైర్మన్ జక్కంరెడ్డి కృష్ణారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంతాచార్యులు ఉన్నారు.

## స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయం



**నెల్లూరురూరల్, ఆగష్టు1 ప్రభాతవార్త** రూరల్ పరిధిలో స్థానిక సమస్యల పరిష్కారమే ధ్యేయమని రూరల్ శాసనసభ్యులు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రూరల్‌లో రెండవ విడత గడపగడపకూ – మనప్రభుత్వం కార్యక్రమాన్ని సోమవారం 2వడివిజన్ స్థానిక గుడిపల్లిపాడు స్థానిక రాజగోపాలరెడ్డినగర్ నుండి నిర్వ హించారు. స్థానిక ప్రజలు వివిధ సమస్యలను ఎమ్మెల్యే కోటంరెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, రూరల్ పరిధిలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందాలన్నారు. సమన్వయంతో సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఏసమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ రూరల్ ప్రగతికి బాటలు వేస్తున్నామన్నారు. సంక్షేమం అమలును సమీక్షించారు. స్థానిక కార్పోరేటర్ పడిగనేటి రామ్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో వైకాపా నాయకులు కోడూరు కమలాకరరెడ్డి, కార్పోరేటర్ జానా నాగరాజు తదితర నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## పేదల కడుపుకొడుతున్న వైసీపీ ప్రభుత్వం



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** రాష్ట్రంలో అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం పేదల కడుపు కొడుతోందని, కేంద్రప్రభుత్వం పేదలకోసం ఉచితంగా అందజేస్తున్న బియ్యాన్ని ఐదునెలలుగా పంపిణీ చేయకుండా ముఖ్యమంత్రి రూ.3 వేల కోట్లు దోచుకున్నారని నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు, నెల్లూరు రూరల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ అబ్దుల్‌అజీజ్ ఆరోపించారు. రేషన్‌వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వవైఖరిని నిరసిస్తూ పలు డిమాండ్లను పొందుపరుస్తూ ఆయన సోమవారం స్పందనకు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్‌యోజన పథకం కింద కేంద్ర ప్రభుత్వం పేదలకై ఉచితంగా పంపిణీ చేస్తున్న బియ్యాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఐదునెలలుగా ఇవ్వడం లేదన్నారు. ఐదునెలలు ఉచితంగా ఇవ్వాల్సిన బియ్యం ఇవ్వకుండా ముఖ్యమంత్రి రూ. 3 వేలకోట్లు సంపాదించాడన్న ఆయన పేదల పొట్టకొట్టి ఆ డబ్బులను దారి మళ్ళిస్తున్నాడన్నారు. ఇక రాష్ట్రవ్యాప్తంగా 1.45 కోట్ల రేషన్‌కార్డులు వుంటే కేవలం 88 లక్షల కార్డులకు ఈనెల ఉచిత బియ్యం పంపిణీ చేస్తున్నారన్న అజీజ్ అదికూడా బియ్యం ఇవ్వకుండా కూపన్లు ఇస్తున్నారన్నారు. అదేవిధంగా టీడీపీ ప్రభుత్వహయాంలో రాష్ట్రంలో 1.47 కోట్ల తెల్లకార్డులుంటే వైసీపీ ప్రభుత్వం వాటిని 1.45 కోట్లకు తగ్గించిందన్న ఆయన నిరుపేదలకు అన్నంపెట్టే అన్నా క్యాంటీన్లను రద్దుచేసిందన్నారు. పక్కనవున్న తమిళనాడులో జయలలిత పేరుతో వున్న క్యాంటీన్లను ప్రస్తుత ప్రభుత్వం అదే పేరుతో కొనసాగిస్తుంటే రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి పేదలకు తక్కువ ధరకు అందే అన్నాన్ని దూరం చేసిందన్నారు. ఇక ఆయా పండుగలకు ఉచితంగా ఇచ్చే కానుకలను కూడా ఆపేసిన ఘనత వైసీపీ ప్రభుత్వానికే దక్కుతుందన్న అజీజ్ పంచభూతాలను దోచుకుంటున్న వైసీపీ ప్రభుత్వానికి పేదలకు అన్నం పెట్టేందుకు మనస్సు రావడం లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి పేదల కడుపుకొడుతుంటే వైసీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు చూస్తూ వూరుకోవడం దారుణమన్న ఆయన అటువంటి వారిని ఎన్నుకోవడం ప్రజలు చేసుకున్న దౌర్భాగ్యమన్నారు. పేదలకు అందాల్సిన ప్రతి గింజా బియ్యం వారికి అందాల్సిందేనన్న ఆయన ఇందుకోసం తమ పార్టీ రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. పార్టీ నెల్లూరు సిటీఇన్‌చార్జ్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జెన్ని రమణయ్య, పనబాక భూలక్ష్మి, రాజానాయుడు, పెంచలనాయుడు, జలదంకి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఆధార్ అనుసంధానం పోస్టర్ల ఆవిష్కరణ



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** ఓటర్‌కార్డుతో ఆధార్‌నంబర్ అనుసంధానానికి సంబంధించిన పోస్టర్లను జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సోమవారం కలెక్టరేట్ ఆవరణంలోని తిక్కన ప్రాంగణంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్‌కార్డుకు ఆధార్‌నెంబర్‌ను అనుసంధానం చేసే ప్రక్రియను కేంద్ర ఎన్నికల సంఘం మొదలుపెట్టిందన్నారు. జిల్లాలో ఈ ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేయాలన్న ఆయన అలాగే స్వచ్చమైన ఓటర్ల జాబితా తయారీకి ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. డిఆర్వో వెంకటనారాయణమ్మ, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, డిపిఓ ధనలక్ష్మి, డ్వామా పీడీ తిరుపతయ్య, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ చందర్, వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు పాల్గొన్నారు.

## వేడుకగా శ్రావణ మాసోత్సవాలు ప్రారంభం



**నెల్లూరురూరల్, ఆగష్టు1 ప్రభాతవార్త** నెల్లూరురూరల్ మండలం నరసింహకొండపై వేంచేసి ఉన్న ఆదిలక్ష్మీదేవి సమేత శ్రీవేదగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేడుకగా నిర్వహిస్తోన్న శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా సోమవారం ఆలయ ప్రధానార్చకులు భాస్కరాచార్యులు ఆధ్వర్యంలో గోదాదేవి తిరునక్షత్రం సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీఆదిలక్ష్మీ అమ్మవారికి పంచామృత అభిషేకం, గాదాదేవి అలంకారం, కుంకుమార్చన తదితర కార్యక్రమాలుజరిగాయి. ఆలయ చైర్మెన్ వేమిరెడ్డి సురేంద్రరెడ్డి, ముఖ్యకార్యనిర్వహణాధికారి గిరిక్రిష్ణ తదితర ధర్మకర్తలు ఏర్పాట్లను సమీక్షించారు. భక్తులు హాజరై తీర్థప్రసాదాలు స్వీకరించి తరించారు.

## ఘనంగా తల్లిపాల వారోత్సవం



**బుచ్చి ఆగష్టు 1 ప్రభాతవార్త** బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని జొన్నవాడ అంగన్‌వాడీ సెంటర్‌లో కార్య కర్తలు పద్మ, అమృతవల్లి నేతృత్వంలో ఘనంగా తల్లిపాల వారోత్స వాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కోవూరు శాసనసభ్యులు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, సిడిపి సౌజన్య హాజరైయ్యారు. ఎ మ్మెల్యే గర్భవతులకు, బాలింతలకు, చిన్నపిల్లలకు బాలామృతంఅందించారు. ప్రభుత్వం తల్లులకోసం, పిల్లల కోసం ఎంతో ఖర్చు చేస్తుందని దీనిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సూపర్‌వైజరు శకుంతల, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాల్గోన్నారు.

## స్పందన అర్జీల పరిష్కారంపై ప్రత్యేకదృష్టి



**నెల్లూరు కలెక్టరేట్, ఆగస్టు 1 ప్రభాతవార్త** స్పందన అర్జీల పరిష్కారంపై అన్నిశాఖల అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో జరిగిన స్పందన కార్యక్రమంలో ఆయన డిఆర్వో వెంకటనారాయణమ్మ, తెలుగుగంగ స్పెషల్ కలెక్టర్ బాపిరెడ్డి, డిఆర్‌డిఏ పీడీ కేవీసాంబశివారెడ్డిలతో కలిసి ప్రజల నుండి వినతిపత్రాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్పందన అర్జీల పరిష్కారంపై అధికారులు ప్రత్యేకదృష్టి సారించాలన్నారు. నిర్దేశించిన సమయానికి ఆయా అర్జీలను పరిష్కరించాలన్న ఆయన వచ్చిన అర్జీలే తిరిగి రాకుండా చూడాలన్నారు. కాగా ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధికారి ఎం. ధనలక్ష్మి, జిల్లాపరిషత్ సీఈఓ వాణి, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమీషనర్ చందర్, వ్యవసాయశాఖ జేడీ సుధాకర్‌రాజు, పశుసంవర్ధకశాఖ జేడీ డాక్టర్ మహేశ్వరుడు, జిల్లా సహకారశాఖాధికారి తిరుపాల్‌రెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరక్టర్ రమాదేవి, బీసీ సంక్షేమశాఖాధికారి వెంకటయ్య, సెట్నెల్ సీఈఓ పుల్లయ్య, మైనారిటీ సంక్షేమ శాఖాధికారి కనకదుర్గాభవాని, సర్వే ల్యాండ్‌రికార్డ్సు ఏడి హనుమాన్‌ప్రసాద్, జలవనరులశాఖ ఎస్‌ఈ కృష్ణమోహన్, డిఎస్‌ఓ వెంకటేశ్వర్లు, దివ్యాంగుల సంక్షేమశాఖ ఏడి రాజకుమారి, సమగ్రశిక్ష పీఓ ఉషారాణి, మత్స్యశాఖ జేడీ నాగేశ్వరావు, డిఎంహెచ్‌ఓ డాక్టర్ పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.

**ఉద్యోగాలివ్వాలంటూ ముంపువాసుల వినతి** కండలేరు జలాశయం కారణంగా నిరాశ్రయులమైన తమకు ప్రభుత్వ ఉద్యోగాలిప్పించాలని కోరుతూ రాపూరు, కలువాయి, పొదలకూరు, చేజర్ల మండలాలకు చెందిన 22 గ్రామాల యువత స్పందనకు వినతిపత్రం అందజేశారు. కండలేరు జలాశయం కారణంగా 5494 కుటుంబాలు నిరాశ్రయులైతే కొంతమందికే ఉద్యోగాలిచ్చారన్న వారు మిగిలిన వారు సరైన ఉపాధి లేక కుటుంబాలతో అవస్థలు పడుతున్నారన్నారు. ఇందుకు సంబంధించి సీనియారిటీజాబితాను తయారుచేయాలని అర్హులమైన తమకు ప్రభుత్వ ఉద్యోగాలిప్పించాలని వారా వినతిపత్రంలో కోరారు.

**ప్రభుత్వపరంగా ఆదుకోవాలంటున్న బాధిత కుటుంబం** నెల్లూరురూరల్ మండలం అనుమానాస్పదంగా మరణించిన నారాయణ కుటుంబసభ్యులు ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలని స్పందనకు వినతిపత్రం అందజేశారు. మాదిగ కులానికి చెందిన నారాయణను హత్య చేయడంతో తమ కుటుంబం రోడ్డునపడిందన్న వారు ఈ నేపధ్యంలో ప్రభుత్వపరంగా తమను ఆదుకోవాలన్నారు. ఆర్థికసాయంతోపాటు ప్రభుత్వ ఉద్యోగం, పొలం ఇప్పించాలని వారా వినతిపత్రంలో కోరారు.

**తిరుపతి కుటుంబానికి ఎక్స్‌గ్రేషియాకై వినతి** మర్రిపాడు ఎస్‌ఐ వెంకటరమణ వేధింపుల కారణంగా ఆత్మహత్యకు పాల్పడ్డ తిరుపతి కుటుంబానికి రూ. 25 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా అందజేయాలని కోరుతూ జిల్లా దివ్యాంగ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధులు స్పందనకు వినతిపత్రం అందజేశారు. దీనితోపాటు దివ్యాంగుడైన తిరుపతి మరణానికి కారణమైన ఎస్‌ఐ వెంకటరమణను శాశ్వతంగా విధుల నుండి తప్పించాలని..తిరుపతికి నెల్లూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన డాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని వారా వినతిపత్రంలో కోరారు.